
ANDHRAJYOTHY
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
సోమవారం 29 జనవరి 2024



మా పోర్టును కాపాడండి సార్.. : చంద్రబాబు సభలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న అదానీ పోర్టు సిబ్బంది




నెల్లూరులోని ఎస్వీజీఎస్ కళాశాల మైదానంలో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్న టీడీపీ శ్రేణులు, అభిమానులు



ఇలాంటి ఎమ్మెల్యేలు అవసరమా!?

బూతులు తిట్టిన వారికి పదవులు ● అభివృద్ధిపై నోరు తెరవని అనిల్

కావలికి పట్టిన చెద రామిరెడ్డి ● డైలీ, వీక్లీ, మంత్లీ కలెక్షన్లలో ప్రసన్న

అన్ని డీల్స్‌లో కాకాణిదే పైచేయి ● మైనింగ్ డీల్స్‌లో విక్రమ్

ఎమ్మెల్యేలపై విరుచుకుపడ్డ టీడీపీ అధినేత చంద్రబాబు

నెల్లూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : 'ప్రజాప్రతినిధులు అంటే ప్రజాసేవ చేస్తారు. కానీ ఇప్పుడు ఎవరెక్కువ బూతులు తిడితే వారు మంచివారట. బూతుల రత్నకు ఎమ్మెల్యే, బూతుల సామ్రాట్‌కు ఎంపీ, ఇంకా ఎక్కువ తిడితే నటసామ్రాట్ కింద మంత్రి పదవి ఇస్తారు. ఇదేం పద్ధతి!? మనం ఉండేది బూతులు పడడానికా!? ఇలాంటి వారు రాజకీయాలకు అవసరమా..? కానీ ప్రజల కోసం అన్నీ పడుతున్నా. సభ్యత అడ్డం వస్తోంది గానీ లేకుంటే వారి అంతు చూసే వాడిని. రాష్ట్ర భవిష్యత్ కోసం సంయమనం పాటిస్తున్నా' అంటూ టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఉద్ఘాటించారు. నెల్లూరు పార్లమెంటుకు సంబంధించి 'రా.. కదలిరా..' కార్యక్రమం ఆదివారం నెల్లూరులోని ఎస్వీజీఎస్ మైదానంలో జరిగింది. మధ్యాహ్నం 12 గంటలకు హెలికాప్టర్‌లో కనుపర్తిపాడులోని హెలిప్యాడ్‌కు చేరుకున్న చంద్రబాబు, అక్కడి నుంచి రోడ్డు మార్గాన సభా వేదికకు చేరుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో చంద్రబాబు వైసీపీ ఎమ్మెల్యే దోపిడీ, అరాచకాలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. చంద్రబాబు ప్రసంగం ఆయన మాటల్లోనే..

● ఒక్కొక్కరిది ఒక్కో చరిత్ర

'నెల్లూరులో ఎమ్మెల్యే అనిల్‌కుమార్ అభివృద్ధి నిల్.. మాటలు ఫుల్. తొడలు కొడతాడు, మీసం మెలేస్తాడు. పిచ్చిపిచ్చిగా మాట్లాడతాడు, గావు కేకలు పెడతాడు కానీ అభివృద్ధి గురించి అడిగితే నోరు కూడా తెరవలేడు. కానీ ఈయన పెద్ద ఎమ్మెల్యే. దొంతాలి వద్ద బినామీల పేరుతో రూ.100 కోట్లు విలువ చేసే 50 ఎకరాలు, నాయుడుపేటలో 58 ఎకరాలు, ఇస్కాన్ సిటీలోనూ బినామీల పేరుతో భూములు కొట్టేశాడు. వీటన్నింటినీ చూసి ప్రజలు ఛీ కొడతా ఉంటే ముఖ్యమంత్రి అతనికి సీటు లేదని చెప్పాడు. ఎక్కడకు పంపుతారో తెలియదు. కావలి ఎమ్మెల్యే గురించి ఎంత చెప్పినా తక్కువే. అతను కావలికి పట్టిన చెద. పేరు చెప్పేది కూడా నాకిష్టం లేదు. అరాచకాలకు బ్రాండ్ అంబాసిడర్ ఆయన. లేఅవుట్ వేస్తే కప్పం కట్టాలి. ఇళ్ల కడితే కమీషన్ ఇవ్వాలి. షాపు పెట్టుకుంటే వసూలు చేస్తాడు. కావలి రూరల్, దగదర్తిలో అక్రమ గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నారు. కోవూరులో నల్లపురెడ్డి డైలీ, వీక్లీ, మంత్లీ మామూళ్ల దండుకుంటున్నాడు. లేఅవుట్ వేయాలంటే కమీషన్ ఇవ్వాలి. ఇసుకలో దోపిడీ. చివరకు ఎమ్మెల్యే తమ్ముడే అన్నకు సీటు ఇవ్వొద్దని చెబుతున్నాడు. ఆత్మకూరులో పేరుకే విక్రమ్. బంధువులందరి ద్వారా కాంట్రాక్టులు, లేఅవుట్లు, ఇసుక దందాలు చేస్తున్నారు. మైనింగ్ డీల్స్ చేస్తున్నారు. సర్వేపల్లిలో ఒక ఎమ్మెల్యే ఉన్నాడు కాకాణి. కాణి లేనిదే పని జరగదు. పోర్టును కూడా అడ్డం పెట్టుకొని డబ్బులు దోచేస్తూ అక్కడ కూడా కార్యక్రమాలు జరగకుండా అడ్డుకుంటున్న ప్రబుద్ధుడు కాకాణి.


ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తూ..

అందుకే తిరుగుబాటు..

టీడీపీ హయాంలో దళిత, గిరిజన విద్యార్థుల కోసం నెల్లూరు రూరల్ మండలం అక్కచెరువుపాడులో గురుకుల పాఠశాల నిర్మించాం. 90 శాతం పూర్తయింది. ఆ పది శాతాన్ని పూర్తి చేయాలని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఎన్నిసార్లు తిరిగినా పని జరగలేదు. కొండాయపాలెం గేట్ వద్ద అంబేడ్కర్ స్టడీ సర్కిల్, బీసీ భవన్ నిర్మాణం చేపడితే వాటిని పూర్తి చేయమని ప్రభుత్వాన్ని అడిగారు. కానీ చేయలేదు. ఆమంచర్లలో 500 ఎకరాల భూమి ఉంటే అందులో పరిశ్రమలు పెడితే ఉద్యోగాలు వస్తాయని అడిగితే అతీ గతీ లేదు. సీఎం చేసేవి తప్పు అని మరో ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి కూడా గళమిప్పారు. తొలిసారి తిరుగుబాటు చేసిన ఇద్దరు ఎమ్మెల్యేలు నెల్లూరు జిల్లాకు చెందిన వారే. అంబేడ్కర్ ఆశయం కోసం చంద్రన్న ఆచరణ చేస్తున్నారని, ప్రజల బతుకు బాగుండాలంటే మళ్లీ టీడీపీ రావాలని పాదయాత్ర చేస్తున్న నెల్లూరుకు చెందిన చింతల అశోక్‌కుమార్‌ను అభినందిస్తున్నా.

● అధికారంలోకి రాగానే..

'తెలుగుదేశం అధికారంలోకి రాగానే సోమశిల హైలెవల్ కెనాల్, సోమశిల అప్రాన్ పనులు పూర్తి చేస్తాం. కొండ్లపూడి లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేస్తాం. కనిగిరి రిజర్వాయర్‌లో పూడిక తీస్తాం. నాడు దగదర్తిలో నేనే ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపన చేశా. అధికారంలోకి రాగానే దానిని పూర్తి చేస్తా. చెన్నై-నెల్లూరు-తిరుపతి నగరాలను ట్రై సిటీ కింద కనెక్ట్ చేసి నెల్లూరు జిల్లాను పారిశ్రామిక హబ్‌గా మారుస్తా. రాళ్లపాడు కాలువ పనులు పూర్తి చేస్తాం. ఉలవపాడు మామిడి మార్కెట్‌ను పూర్తి చేసి ప్రారంభిస్తాం. ఉదయగిరిలోని పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ పనులు కూడా పూర్తి చేస్తాం".

తమ్ముళ్లలో జోష్!

నెల్లూరులో చంద్రబాబు సభ విజయవంతం

టీడీపీ, జనసేన శ్రేణుల్లో కదనోత్సాహం నింపిన రా.. కదలిరా!

మండుటెండను లెక్కచేయని అభిమానం

నెల్లూరు (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో ఆదివారం జరిగిన రా.. కదలిరా..!!! సభ టీడీపీ, జనసేన పార్టీ శ్రేణుల్లో ఎన్నికల కదనోత్సాహం నింపింది. టీడీపీ అధినేత నారా చంద్రబాబు ప్రసంగం రాష్ట్ర భవిష్యత్తు పట్ల ప్రజలను ఆలోచింపజేసింది. వేలాదిగా తరలివచ్చిన జన సందోహం పసుపుదళంలో సంతోషాన్ని నింపగా, జైలు జీవితం తరువాత తొలిసారిగా నెల్లూరుకు వచ్చిన చంద్రబాబును చూడగానే ప్రజలు ఉద్వేగానికి లోనుకావడం రానున్న ఎన్నికల ఫలితాలను ప్రస్ఫూటింపజేసింది. నెల్లూరు నగరం మొత్తం సభా ప్రాంగణమైన ఎస్వీజీఎస్ మైదానం వైపు మళ్లింది. ఉదయం పది గంటల నుంచే పార్టీ జెండాలు చేతబట్టిన టీడీపీ, జనసేన పార్టీల కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు సభా ప్రాంగణానికి చేరుకోవడం మొదలెట్టారు. సభ ప్రాంగణాన్ని కలిపే జాతీయ రహదారి నగరవాసుల తాకిడిని తట్టుకోలేక కిటకిటలాడింది. చంద్రబాబు వచ్చే సరికి మధ్యాహ్నం ఒంటి గంట అయ్యింది. అప్పటివరకు ప్రజలు మండుటెండను సైతం లెక్కచేయక ఎదురుచూశారు. నీడ కోసం షామియానాలు వేయకున్నా కట్టుకదల్లేదు. చంద్రబాబు వేదికపైకి అడుగుపెట్టగానే పెద్ద ఎత్తున హర్షధ్వానాలు చేస్తూ అభివాదం చేశారు. సీఎం..సీఎం అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. చంద్రబాబు ప్రసంగం కూడా కార్యకర్తల్లో చైతన్యాన్ని, ప్రజల్లో ఆలోచనను కలిగించింది. ఐదేళ్లపాటు రాష్ట్రంలో ఎలా దోపిడీ జరిగింది, రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీ ఎలా శ్రమించింది చంద్రబాబు వివరించిన తీరు ఆకట్టుకుంది. టీడీపీ, జనసేన పార్టీల సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడటం ఎంత అవసరమో వివరించిన తీరు ప్రజలను ఆలోచింపజేసింది. రా.. కదలిరా! కార్యక్రమం ప్రజలకు మాత్రమే కాదని రాష్ట్ర భవిష్యత్తు కోసం తెలుగుదేశం, జనసేన పార్టీలతో కలిసి వచ్చే వైసీపీ నాయకులు, కార్యకర్తలను కూడా ఆహ్వానిస్తున్నామని చంద్రబాబు అన్న మాటలు కొత్త ఆలోచనలను కలిగించింది. జిల్లా నుంచి ఇంకా ఎవరైనా వైసీపీ నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకోవడానికి సిద్ధంగా ఉన్నారా!? అనే చర్చ మొదలయ్యింది. హెలిప్యాడ్ వద్ద చంద్రబాబును రిసీవ్ చేసుకున్న దగ్గర నుంచి తిరిగి వెళ్లే వరకు అడుగడుగునా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయన్నుకలిసేందుకు ఎగబడ్డారు.







బ్రిటీష్ పాలన కంటే దారుణంగా ఏపీ!



ఏపీలో బ్రిటీష్ పాలన కంటే దారుణంగా వైసీపీ పాలన సాగుతోంది. రాక్షస పాలనకు అద్దం పట్టే విధంగా జగన్ సర్కారు నడుస్తోంది. 2014-19ల మధ్య జరిగిన అభివృద్ధిలో కనీసం 5 శాతం కూడా నెల్లూరులో జరగలేదు. ఈ విషయాన్ని స్వయంగా ప్రజలే చెప్తున్నారు. పన్నులు పెంచకుండా చేసేదాన్నే పాలన అంటారు. పరిశ్రమల స్థాపన లేకుండా రాష్ట్రానికి ఆదాయం, ఉపాధి ఎలా వస్తుంది.

- పీ నారాయణ, మాజీ మంత్రి

వైసీపీకి ఈ సభ నుంచే హెచ్చరిక



ఎర్రటి ఎండలోనూ లెక్క చేయక నిలబడిన కార్యకర్తలతో సందడిగా మారిన కదిలిరా సభ అదిరింది. ఇక్కడ నుంచే వైసీపీకి హెచ్చరిక మొదలవు తుంది. ప్రకృతిని విధ్వంసం చేసే స్థాయికి వైసీపీ అరాచ కాలు చేరాయి. నెల్లూరులో ఉండే మంత్రి ఉదయం టిఫిన్‌లోకి మట్టి, మధ్యాహ్నం భోజనంలోకి ఎర్రమట్టి, రాత్రి డిన్నర్‌లోకి ఇసుక తిని బతికేస్తున్నాడు. నెల్లూరు జిల్లాకు, రాష్ట్రానికి ఊపిరైన కృష్ణపట్నం పోర్టును ఈ నెలాఖరున తరలించేస్తున్నట్లు అదానీ కంపెనీ సమా చారం ఇచ్చింది. ఇందుకు మంత్రి దందానే కారణం.

- సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, మాజీ మంత్రి

వైసీపీ పాలనలో రెడ్లే నష్టపోయారు



రాష్ట్రంలో వైసీపీ పాలన వచ్చాక అన్నీ వర్గాల కంటే ఎక్కువగా నష్ట పోయింది. రెడ్లే. అన్నీ విధాల చితికి పో యారు. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ఏ ఒక్క రంగం ఆశించినంత ప్రగతి సాధించలేదు. అన్ని రంగాలలో ప్రాధాన్యతగా ఉన్న రెడ్లు ఆర్థికంగా కోలుకోలేని దెబ్బతిన్నారు.

- రాంగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ


ప్రజలే యుద్ధానికి సిద్ధం



చంద్రబాబుపై అక్రమ కేసులు బనాయించి, జైలుకు పంపి జగన్ పెద్ద తప్పు చేశాడు. జీవితంలో ఈ తప్పును సరిదిద్దుకోలేడు. విప్లవ కెరటాల్లో తరలి వచ్చిన టీడీపీ శ్రేణుల ఉత్సా హంతోనే చంద్రబాబు ప్రమాణ స్వీకారం ఖరారైంది. ప్రజలే యుద్ధానికి సిద్ధమయ్యారు. జిల్లాలో పదికి పది స్థానాలు గెలుస్తాం. రాష్ట్రంలో 57 శాతం ఓట్లుతో 160 స్థానాలు టీడీపీ, జనసేన కూటమి గెలుస్తుంది.

- కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే

జగన్ జైలుకెళితే ఇక రాడు!



సమయం లేదు మిత్రమా... కేవలం 70 రోజులు మాత్రమే ఉంది. ఆ తరువాత చంద్ర బాబు నాయకత్వం తో టీడీపీ ప్రభుత్వం ఏర్పడుతుంది. మూడు ముక్కల జగన్ ఇంటికి వెళ్తాడు. ఈ సారి జగన్ జైలుకు వెళ్తే ఇక రాడు. నెల్లూరులో నారాయణ మీద పోటీ చేసేందుకు అభ్యర్థి దొరకక వైసీపీ వెతుకులాడుతోంది. విర్రవీగిన అనిల్‌కు చివరికి సీటే లేకుండా పోయింది.

- కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నుడా మాజీ చైర్మన్

ఏం చేశాడని ఆయన్ను గెలిపించాలి



పేదోడికి పట్టెడన్నం కూడా పెట్ట లేని వ్యక్తి ఇక ప్రజలను ఎలా పాలించగలరు. రూ.5లకు అన్నం తినే అన్న క్యాంటీన్లను అర్థంతరంగా తీసేశాడు. దీంతో పేదోడి కడుపు మీద కొట్టాడు. ఇప్పటికీ ప్రభుత్వాలు మారిన తమిళనాడులో అమ్మ క్యాంటీన్లు, కర్ణాటకలో ఇందిరమ్మ క్యాంటీన్లు నడుస్తూనే ఉన్నాయి. ఇటు తిండి పెట్టక, అటు ఇల్లు ఇవ్వక పేదలకు ఏం చేశాడని మళ్లీ జగన్ను గెలిపించాలి.

- అబ్దుల్ అజీజ్, మాజీ మేయర్

ఎమ్మెల్యే ప్రసన్నకు ధనదాహం



2014-19 మధ్య కోవూరు నియోజక వర్గాన్ని టీడీపీ హయాంలో రూ.1600 కోట్లతో మా తం డ్రి పోలంరెడ్డి శ్రీనివా సులురెడ్డి అభి వృద్ధి చేశాడు. కానీ ఆ తరువాత వచ్చిన నల్లపురెడ్డి ప్రస న్నకు మార్‌రెడ్డి ధన దాహంతో రూ.1500 కోట్లు అక్రమంగా సంపాదిం చుకున్నాడు. ఇప్పటికి రాష్ట్రంలో సంక్షే మం అందని వారు 60 శాతం మంది ఉన్నాడు.

- పోలంరెడ్డి దినేష్ రెడ్డి, కోవూరు టీడీపీ ఇన్‌చార్జి

జాయింట్ కలెక్టర్ బదిలీ

● నూతన జేసీగా ఆదర్శ్ రాజేంద్రన్

నెల్లూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ బదిలీ అయ్యారు. ఆయనను రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ డైరెక్టర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. 2022 ఆగస్టులో జేసీగా వచ్చిన కూర్మనాథ్ 18 నెలలపాటు జిల్లాలో పనిచేశారు. నూతన జాయింట్ కలెక్టర్‌గా ఆదర్శ్ రాజేంద్రన్‌ను నియమించారు. ఆయన ప్రస్తుతం నూజివీడు సబ్ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. కాగా, జేసీ ఆకస్మిక బదిలీ ఉద్యోగ వర్గాల్లో చర్చనీయాం శంగా మారింది.

సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వోగా శ్రీనివాసరెడ్డి


డీఎఫ్‌వో శ్రీనివాసరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగులు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), జనవరి 28 : సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వోగా శ్రీనివాసరెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు జిల్లా మంగళగిరి అటవీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఆయనను ప్రభుత్వం నెల్లూరు జిల్లాకు బదిలీ చేసింది. సోషల్ ఫారెస్ట్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న రేంజర్లు, ఉద్యోగులు శ్రీనివాసరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లాలో ఎస్‌ఐలకు స్థానచలనం

నెల్లూరు (క్రైం) : ఎన్నికలు సమీపిస్తున్న వేళ జిల్లావ్యాప్తంగా పలువురు ఎస్‌ఐలను బదిలీ చేయడంతోపాటు వీఆర్‌లో ఉన్న వారికి స్టేషన్లను కేటాయిస్తూ ఎస్పీ కె తిరుమలేశ్వరరెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ
ఎం శివ నాంచారయ్య	వీఆర్, నెల్లూరు	కేపీ పోర్టు
ఎస్కే రహముత్తుల్లా	వీఆర్, నెల్లూరు	సీసీఎస్
డి రామకృష్ణ	వీఆర్, నెల్లూరు	పొదలకూరు
జి కిరణ్‌బాబు	వీఆర్, నెల్లూరు	సంతపేట
బి మహేంద్ర	బుచ్చిరెడ్డిపాలెం	సీసీఎస్
టి భవాని	వీఆర్, నెల్లూరు	వేదాయపాలెం
జి ఏడుకొండలు	వీఆర్, నెల్లూరు	సీసీఎస్
ఎన్ నరహరి	వీఆర్, నెల్లూరు	దర్గామిట్ట
డి కిషోర్‌బాబు	వీఆర్, నెల్లూరు	నార్త్ ట్రాఫిక్
వి సుబ్బారావు	వీఆర్, నెల్లూరు	నెల్లూరు రూరల్
ఎమ్ రాజ	వీఆర్, నెల్లూరు	విడవలూరు
సీహెచ్ చంద్రవతి	వీఆర్, నెల్లూరు	నవాబుపేట
జి అరుణజ్యోతి	వీఆర్, నెల్లూరు	దర్గామిట్ట
బి రమేష్‌బాబు	దర్గామిట్ట	డీటీసీ
డి సుబ్రమణ్యం	దర్గామిట్ట	డీటీసీ
ఎమ్ కోటేశ్వరరావు	వీఆర్ నెల్లూరు	పీసీఆర్
టి వెంకటరావు	వీఆర్, నెల్లూరు	సీసీఎస్
పి వెంకటేశ్వర్లు	వీఆర్, నెల్లూరు	సీసీఎస్
పి సుబ్బారావు	వీఆర్, నెల్లూరు	సీసీఎస్
టి పెంచలయ్య	వీఆర్, నెల్లూరు	సీసీఎస్
ఎమ్ జోజి	వీఆర్, నెల్లూరు	నవాబుపేట
వి వెంకటరావు	వీఆర్, నెల్లూరు	సీసీఎస్
విఆర్‌కె మూర్తి	వీఆర్, నెల్లూరు	ఎస్‌హెచ్ స్క్వాడ్
బి మధుసూదనరావు	వీఆర్, నెల్లూరు	డీసీఆర్‌బి
బి మణిక్యరావు	వీఆర్, నెల్లూరు	సీసీఎస్
ఎమ్ శ్రీనివాసులు	వీఆర్, నెల్లూరు	కావలి-2
వి భాష్కరరావు	వీఆర్, నెల్లూరు	ఆత్మకూరు
జె జనార్థనరావు	వీఆర్, నెల్లూరు	డీటీసీ
కె నాగేశ్వరరావు	వీఆర్, నెల్లూరు	సంతపేట
వి రాంబాబు	వీఆర్, నెల్లూరు	ఉదయగిరి
ఐ రమాదేవి	వీఆర్, నెల్లూరు	సీసీఎస్
కె వెంకటనరసారాజు	వీఆర్, నెల్లూరు	రాపూరు
డిఎస్ విజయకుమార్	వీఆర్, నెల్లూరు	సైదాపురం



ఒక్కటైన పూర్వ విద్యార్థులు

అపూర్వ కలయిక

వారంతా ఒకేచోట చదువుకున్నారు. పదో తరగతి పూర్తయ్యాక కొంతమంది ఉద్యోగాల్లో స్థిరపడగా, మరికొంత మంది వ్యాపారం, ఇతర రంగాల్లో కొనసాగుతున్నారు. పొదలకూరు డీఎస్ ఆర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో 1990-91 బ్యాచ్ విద్యార్థులు ఆది వారం మండల కేంద్రంలోని పీవీఎస్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. చదువు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ మధుర జ్ఞాపకాలను తమ తమ సెల్‌ఫోన్లలో బంధించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హెచ్‌ఎం కె.సనత్‌కుమార్ పాల్గొన్నారు.

- పొదలకూరు

డబ్బులు ఇచ్చినా
మీటరు మార్చలేదయ్యా!

- లబోదిబోమంటున్న గిరిజన దంపతులు

మనుబోలు, జనవరి 28: మండ లంలోని కాగితాల పూరులో మానికల రామయ్య, భవాన మ్మ దంపతులు ప్రభుత్వం కట్టించిన కాలనీ ఇంట్లో నివసిస్తున్నారు. నిరుపేదలు వారు. అయితే వారికి వస్తున్న కరెంటు బిల్లులను చూసి ఆ దంపతులు గగ్గోలు పెడుతున్నారు. ఇదే విషయాన్ని ఇటీవల బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమానికి వచ్చిన మాజీ మంత్రి సోమిరెడ్డికి చెప్పి లబోదిబోమన్నారు. ఇంత కరెంటు బిల్లు ఎందుకు వస్తుందని జనవరిలో రీడింగ్ తీస్తున్న వ్యక్తిని అడిగారు. మీటర్ చెడిపోయిందని, మార్చాలంటే రూ.650 డబ్బులు కట్టాలని చెప్పారు. అదే సమయంలో లైన్ మన్ రాగా, మీటరు మార్చేందుకు రూ. 650 ఇచ్చాడు. డబ్బులు ఇచ్చి 20రోజులు గడుస్తున్నా మీటరు మార్చనే లేదు. ఈ విషయమై ఉన్నతాధికారులు ఏమాత్రం స్పందిస్తారో చూడాలి మరి. !



కరెంటు బిల్లు చూపుతున్న గిరిజన దంపతులు



స్కేటింగ్ సరదా !

మనుబోలు, జనవరి 28: ఈ చిత్రంలోని పిల్లలు హెల్మెట్‌లు, కాళ్లకు చక్రాలు తగిలించుకుని చకాచకా నడిచేస్తున్నారు గమనించారా. వీరంతా జిల్లాకు చెందిన స్కేటింగ్ చిన్నారులే. సండే సరదాగా ఇలానే నడుచుకుంటూ నెల్లూరు నుంచి గూడూరు వరకు హైవేపై వెళ్లారు. వీరికి రక్షణగా స్కేటింగ్ శిక్షకులు కూడా పక్కనే మోటా ర్‌సైకిళ్లపై వస్తూ, వారికి సూచనలు ఇచ్చారు.

ఎక్స్‌కవేటర్ స్వాధీనం

సైదాపురం, జనవరి 28 : మండల పరిధిలోని తోకల పూడి అటవీ ప్రాంతంలో అక్ర మంగా తెల్లరాయి తవ్వకాలు చేస్తున్న ఎక్స్‌కవేటర్‌ను ఆది వారం అటవీశాఖ అధికా రులు స్వాధీనం చేసుకు న్నారు. ఈ సందర్భంగా నెల్లూరు రేంజర్ మాట్లా డుతూ ఫారెస్ట్ భూముల్లో అక్రమంగా తెల్లరాయి తవ్వకాలపై సమాచారం రావడంతో దాడులు నిర్వహించి యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. దీనిపై విచారణ చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సెక్షన్ అధికారి అమీనయ్య, బీట్ ఆఫీసర్లు గిరిజ, విజయ్ పాల్గొన్నారు.



ఫారెస్ట్ అధికారులు స్వాధీనం చేసుకున్న ఎక్స్‌కవేటర్

జూదరుల అరెస్ట్

నెల్లూరు(క్రైం), జనవరి 28: నెల్లూరులోని జాకీర్‌హుసేన్‌నగర్ సమీపంలో పెన్నానది వద్ద పేకాటాడుతున్న నలుగురు జూదరులను ఆదివారం నవాబుపేట పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.20వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

పెన్నాలో ఒకరి మృతదేహం

నెల్లూరు(క్రైం), జనవరి 28: నెల్లూరులోని పెన్నానది తీరాన గొబ్బెమ్మల పండుగ జరిగే ప్రాంతంలో ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం నీటిపై తేలాయాడుతుండగా స్థానికులు గుర్తించి సంతపేట పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ వేణుగోపాల్ ఘటన స్థలానికి చేరుకుని స్థానికుల సహకారంతో మృతదేహాన్ని వెలుపలికి చేర్చారు. 40 నుంచి 45 ఏళ్లలోపు వ్యక్తి మృతి చెందాడని, మృతదేహంపై బనియన్, షార్ట్ ఉన్నాయని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు సంతపేట పోలీసులను సంప్రదించా లని ఆయన కోరారు.

టిప్పర్ ఢీకొని యువకుడి మృతి

సైదాపురం జనవరి 28 : మండల పరిధిలోని సిద్ధలకోన రోడ్డు వద్ద ఆదివారం టిప్పర్ ఢీ కొని జార్ఖండ్‌కు చెందిన యువకుడు మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు, జార్ఖండ్‌కు చెందిన బేయస్‌కుమార్ (17) హిటాచీ ఆపరేటర్‌గా ఓ మైన్‌లో పనిచేస్తున్నాడు. తెల్లవారు జామున స్నేహితులతో కలసి రోడ్డుపై నడుచుకుంటూ వెళుత్తున్న సమయంలో సైదాపురం నుంచి ఊటుకూరు వైపు వెళ్తున్న టిప్పర్ ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. దీంతో స్నేహితులు చికిత్స నిమిత్తం గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న టిప్పరు

ఆటోకు నిప్పు

అనంతసాగరం, జనవరి 28: మండలంలోని వరికుంటపాడులో ఆదివారం తెల్లవారు జామున ఓ ఆటో దగ్ధమయింది. బాధితుడు రామయ్య కథనం మేరకు, ఆటోను ఇంటి ముందు పార్కింగ్ చేయగా గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో కాలిపోయిందన్నారు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా, ఆత్మకూరు సీఐ వేణు, ఎస్‌ఐ సూర్యప్రకాష్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేశామని త్వరలో నిందితులను పట్టుకొంటామని వారు తెలిపారు.



మంటల్లో కాలిన ఆటో

కుక్కల దాడిలో ఐదుగురికి గాయాలు

మండల కేంద్రం అనంతసాగరంలో కుక్కల బెడద ఎక్కువైంది. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజుల వ్యవధిలో కుక్కల దాడిలో ఐదుగురికి గాయాలయ్యాయి. పంచాయతీ అధికారులు దృష్టి సారించి కుక్కల నివారణకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

గేదెను ఢీకొని ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, జనవరి 28: మండలంలోని పుంజులూరుపాడు రైల్వేగేటు సమీపంలో కృష్ణపట్నం పోర్టురోడ్డుపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు, పొదలకూరుకు చెందిన రమేష్, అశోక్‌లు మోటర్ బైక్‌పై ముత్తుకూరుకు వెళ్లి తిరిగి వస్తుండగా రైల్వే గేటు దాటిన తర్వాత గేదె అడ్డురావడంతో బైక్ అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. పంటపాళెంలోని ఓ ప్రైవేటు క్లినిక్‌కు తరలించి ప్రథమ చికిత్స అందించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	130
లేయర్ లైవ్	85
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	260
లేయర్	145

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 5963
వెండి కిలో ధర	రూ. 73,300
వెండి ఒక గ్రాము	రూ. 75.30

వింత వ్యాధితో వీధి కుక్కల మృతి

వింజమూరు, జనవరి 28 : పట్టణంలోని పలుచోట్ల వీధి కుక్కలు వింత వ్యాధితో మృతి చెందుతున్నాయి. దీంతో దుర్వాసన వస్తూ ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తున్నాయి. పంచాయతీ సిబ్బంది వాటిని తొలగించకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైశ్యాబజార్‌లో రెండు రోజుల క్రితం కుక్క చనిపోయి రోడ్డుపై పడి ఉన్నా పంచాయతీవారు చూస్తూపోతున్నారే తప్ప దాన్ని తొలగించలేదు. ఇప్పటికైనా తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



చనిపోయిన వీధి కుక్క

సాగునీటి పొదుపునకు చర్యలు

- మూడు లక్షల ఎకరాల్లో వరిసాగు
- పెరుగుతున్న ఎండలు
- క్రమేణా తగ్గుతున్న నీటి నిల్వలు
- వారబంది (పూటల పద్ధతి)కి శ్రీకారం

సంగం, జనవరి 28: జిల్లాలో రబీ సీజన్(మొదటి పంట)లో సుమారు మూడు లక్షల ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. పెరుగుతున్న ఎండలతో జలాశయాలు, రిజర్వాయర్‌ల్లో నీటి నిల్వలు క్రమేణా తగ్గుతున్నాయి. దీంతో పంట చివరి దశకు చేరేటప్పటికి సాగునీటి కష్టాలు తలెత్తే అవకాశం ఉంది. దీంతో వారం కిందట జిల్లా కలెక్టర్ ఇరిగేషన్ అధికారులతో చర్చించారు. భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్త కుండా సాగునీటి పొదుపునకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆ మేరకు అధికారులు జిల్లాలోని కొన్ని కాలువ కింద వారబంది (పూటల పద్ధతి)కి శ్రీకారం చుట్టారు.



సాగులో ఉన్న వరి పైరు

● తక్కువగా నీటి నిల్వలు

జిల్లాలో ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల అటు సోమశిల జలాశయం, ఇటు రిజర్వాయరు, చెరువుల్లో నీటి నిల్వలు తక్కువగా చేరాయి. నవంబరులో జరిగిన ఐఏబీ సమావేశం నాటికి సోమశిలలో 29 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉన్నాయి. ప్రాధాన్యత కింద డెల్టాకు 2 లక్షల ఎకరాలకు నవంబరు 20 నుంచి సాగు నీటి విడుదలకు అనుమతి ఇచ్చారు. ఇంతలో తుఫాన్ రావడంతో ఒక్క రోజు నీటి విడుదల చేసి నిలిపి వేశారు. తుఫాన్ వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి సుమారు 7 టీఎంసీల నీరు జలాశయంలో చేరింది. దీంతో జలాశయంలో నీటి మట్టం 36 టీఎంసీలకు చేరింది. పెరిగిన ఈ నీటి నిల్వలను కనుపూరు, బెజవాడ పాపిరెడ్డి, ఉత్తర, దక్షిణ కాలువ కింద కొంత మేరకు సాగుకు అనుమతిచ్చారు. ప్రస్తుత రబీ సీజన్‌లో సుమారు 3 లక్షల ఎకరాల్లో వరి సాగైనట్లు ఇరిగేషన్ అధికారులు ప్రకటించారు. ప్రస్తుతం సోమశిలలో నీటి నిల్వ 27 టీఎంసీలకు చేరింది.

● రైతుల ఆందోళన

నవంబరులో నీటి విడుదల చేసిన తరువాత నారుమళ్లు పోసినా వర్షాలకు దెబ్బతిన్నాయి. దీంతో కొన్ని చోట్ల నాట్లు ఆలస్యమయ్యాయి. ఎక్కువ శాతం డిసెంబరు చివర వారంలో నాట్లు వేశారు. కొందరు జనవరి మొదట్లో కూడ నాట్లు వేశారు. ఆలస్యంగా నాటిన నాట్లకు ఏప్రిల్ 15 వరకు సాగునీటిని విడుదల చేయాల్సిన అవసరం ఉంది. అయితే ఇరిగేషన్ అధికారులు మార్చి 15 వరకే నీటి విడుదల చేస్తామని ఇటీవల ప్రకటించడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● తగ్గుతున్న నీటి నిల్వలు

సోమశిలతోపాటు జిల్లాలోని చెరువుల్లో నీటి నిల్వలు క్రమేణా తగ్గిపోతున్నాయి. ప్రస్తుతం సోమశిలలో నీటి నిల్వ 27 టీఎంసీలకు పడిపోయింది. డెడ్ స్టోరేజ్, వేసవిలో జిల్లా ప్రజలకు తాగునీటి అవసరాలకు పోను ఇక సాగుకు అందేది కేవలం 18 టీఎంసీలే. దీనికితోడు ఎండలు పెరుగుతున్నాయి. జలాశయంలో నీటి ఆవిరి పెరుగుతుంది. ఈ నేపథ్యంలో సాగైన పైరుకు చివరి ఆయకట్టుకు సాగునీటిని అందించాల్సిన పరిస్థితి అధికార యంత్రాంగంపై ఉంది.

రైతులు సహకరించాలి

సోమశిలలో నీటి నిల్వలు పడిపోతున్నాయి. కాలువలకు వారబంది (పూటల పద్ధతి) విధానం అమలు చేయనున్నాం. నీటిని వృథా చేయకుండా చివరి ఆయకట్టు వరకు నీరు పారేలా రైతులు సహకరించాలి.

- బీవీ కృష్ణ, ఏఈఈ, సంగం ఇరిగేషన్ సెక్షన్

● వారబందికి శ్రీకారం

కలెక్టర్ ఆదేశాల మేరకు ఇరిగేషన్ అధికారులు నీటి పొదుపు చర్యల్లో భాగంగా వారబంది(పూటల పద్ధతి)కి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే కనిగిరి రిజర్వాయర్ కింద అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా సంగం డెల్టాలో సోమవారం నుంచి అమలుకు శ్రీకారం చుట్టారు. అంటే సోమ, మంగళ, బుధ, గురువారాల్లో కాలువలకు నీటిని విడుదల చేస్తారు. మిగతా మూడు రోజుల్లో నీటిని నిలిపి వేయనున్నారు.

5న చలో విజయవాడ



చలో విజయవాడ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బీటీఏ నాయకులు

నెల్లూరు (విద్య), జనవరి 28 : ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలపై బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) పోరాటాలకు సన్నద్ధమైందని, ఇందులో భాగంగా ఫిబ్రవరి 5న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆ సంఘం నేతలు ప్రకటించారు. ఆదివారం నెల్లూరులోని దర్గామిట్ట మునిసిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో చలో విజయవాడ కార్యక్రమ కరప్రతాలు ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పట్టించుకోకుండా వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. ఈ క్రమంలో బీటీఏ మూడుదశల ఉద్యమాన్ని చేపట్టిందని, మూడోదశలో చలో విజయవాడ కార్యక్రమాన్ని ధర్నాచౌక్ వద్ద నిర్వహిస్తున్నా మని తెలిపారు. దీనికి వేలాదిగా ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీటీఏ వ్యవస్థాపకులు నూకలపాటి రమణయ్య, రాష్ట్ర నాయకులు పల్లం వేణుగోపాల్, ఆదినారాయణ, స్టెల్లా, మనోజ్, తిరుపతయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మాన ప్రసాద్, భాగ్యమ్మ పాల్గొన్నారు.

విలువ లేని పదవి మాకెందుకు ?

- రాజీనామా దిశగా ఎంపీటీసీ దంపతులు
- అధికారపార్టీ నేతలపై మండిపాటు

వరికుంటపాడు, జనవరి 28: అధికారపార్టీ ఎంపీటీసీగా రూ. లక్షలు ఖర్చు పెట్టి గెలిచినా. పార్టీలో కనీస విలువ కూడా లేదని విరువూరు ఎంపీటీసీ కే లక్ష్మీదేవి దంపతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ధర్మవరంలోని తన నివాసంలో భర్త రమేష్‌తో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన భూపంపిణీ పథకంలో భాగంగా పేదలకు న్యాయం చేయాలనే తలంపుతో ఇటీవల నియోజకవర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి సూచన మేరకు అర్హుల జాబితాను రూపొందించి ఆయన వద్దకు తీసుకెళ్లామన్నారు. అనంతరం సంతకాలు చేసిన ఆయన ఆ జాబితాను మండలంలో కీలకంగా వ్యవహరించే నాయకుడికి అప్పగించాలని చెప్పడంతో ఆయన వద్దకు వెళ్లగా అడ్వాన్స్‌గా రూ. 3లక్షలు చెల్లించాలని ఆదేశించడంతో విస్తుపోయామన్నారు. తెలంగాణాలో బేల్దారి పనులు చేసుకుంటున్న తమను తీసుకొచ్చి రాజకీయంగా అప్పులపాలు చేశారని వారు వాపోయారు. ఈ పరిస్థితుల్లో నగదు ఇవ్వలేమని చెప్పగా, తాము ప్రతిపాదించిన జాబితాను పక్కన పడేయడం ఎంతవరకు సమంజసమని మండిపడ్డారు. పదవి చేపట్టి మూడేళ్లయినప్పటికీ ఇంతవరకు పైసా నిధులు కూడా అందకపోవడంతో అభివృద్ధి పనులు చేపట్టే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. దీంతో మనోవేదన తట్టుకోలేక పదవులతోసహా పార్టీకి కూడా త్వరలోనే రాజీనామా చేసే దిశగా అడుగులు వేస్తున్నట్లు వారు తెలిపారు.



అర్హుల జాబితా చూపుతున్న ఎంపీటీసీ లక్ష్మీదేవి

మున్సిపల్ కార్మికులతో ఒప్పందాలపై
జీవో విడుదల చేయాలి

- కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

నెల్లూరు (వైద్యం), జనవరి 28 : మున్సిపల్ కార్మికుల సమ్మె సమయంలో వారితో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలపై జీవోను వెంటనే విడుదల చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం జిల్లా కార్యాలయంలో కార్మిక సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డిసెంబరు 26 నుంచి ఈ నెల 16 వరకు రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు సమ్మె చేశారని చెప్పారు. అప్పట్లో ప్రభుత్వంతో కొన్ని ఒప్పందాలు జరిగాయన్నారు. వాటికి సంబంధించి జీవోలు వెంటనే విడుదల చేయాలని కోరారు. డ్రైవర్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, పార్క్‌లో పనిచేసే కార్మికులకు రూ.24,500 వేతనం, సమ్మె కాలానికి వేతనాలు, సంక్షేమ పథకాలు అమలు తదితర హామీలపై జీవోలు విడుదల చేయాలన్నారు. ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలపై నియమించిన కమిటీ త్వరగా జీతాల పెంపునకు సంబంధించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు కామాక్షమ్మ, పెంచలనర్సయ్య, నగర, అధ్యక్షకార్యదర్శులు సునీల్, అశోక్, ఇంజనీరింగ్ విభాగం నేతలు బాలు, శ్రీను, కొండమ్మ, సలోమి, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

కాగితాల్లోనే
కావలి అభివృద్ధి

- కలగా మిగిలిన కనకపట్నం
- అసంపూర్తిగా ఫ్లైవోవర్ వంతెన
- పూర్తి కాని ట్రంకురోడ్డు పనులు
- హామీగానే మిగిలిన ఇందిరమ్మ కాలనీలో వసతుల కల్పన

కావలి టౌన్, జనవరి 28: బ్రహ్మంగారి కాలజ్ఞానంలో చెప్పినట్లుగా కావలిని కనక పట్నంగా అభివృద్ధి చేస్తామన్న నేతల మాటలు కాగితాలకే పరిమితమయ్యాయి. అభివృద్ధి మాటేమోగాని ఎక్కడి పనులు అక్కడే అసంపూర్తిగా మిగిలిపోయాయి. మరో రెండువారాల్లో ఎన్నికల నోటిఫికేషన్ విడులయ్యే అవకాశాలు ఉండడంతో కావలి అభివృద్ధి హుష్‌కాకేనా ? అని ప్రజలు నిట్టూరుస్తున్నారు.

● అసంపూర్తిగా ఫ్లైవోవర్ పనులు

పట్టణంలో ట్రాఫిక్ రద్దీ పెరిగిపోవడం ఉదయగిరి రోడ్డు ఫ్లైవోవర్ వంతెనతోపాటు రైల్వేస్టేషన్‌కు ఉత్తరం వైపు పెద్దపవని రోడ్డు గేట్ వద్ద ఫ్లైవోవర్ నిర్మాణం చేసేందుకు సుమారు 17ఏళ్లనాడు శిలాఫలకం వేశారు. రైల్వే ట్రాక్ క్రాసింగ్ చేస్తు రైల్వేవారు బ్రిడ్జి నిర్మాణం చేపట్టినప్పటికీ ఇరువైపులా నిర్మాణం చేపట్టాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ అంగుళం పనికూడా చేయలేదు. 2019లో వైసీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మంత్రులు రూ. 43కోట్లతో ఆర్భాటంగా తిరిగి శిలాఫలకం వేశారు. అయినా పనులు సాగలేదు.

● పూర్తి కాని ట్రంకురోడ్డు పనులు

రూ. 55 కోట్లతో ట్రంకురోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా మూడేళ్ల క్రితం మొదలు పెట్టిన సైడ్ కాలువల పనులే అసంపూర్తిగా ఉన్నాయి. రోడ్డు వెడల్పు, డివైడర్లు, గ్రీనరీ, సెంట్రల్ లైటింగ్ ప్రచారానికే పరిమితమయ్యాయి.

● మౌలిక వసతులేవి ?

సీఎం జగన్ గతేడాది కావలిలో పర్యటించారు. ఈ సందర్భంగా బహిరంగ సభలో మాట్లాడుతూ రూ. 100కోట్లతో ఇందిరమ్మ కాలనీలో మౌలిక వసతుల కల్పన చేపడతామన్న హామీ హామీగానే మిగిలిపోయింది. 20ఏళ్ల క్రితం రూపుదిద్దుకున్న ఇందిరమ్మ కాలనీలో ఇప్పటికీ మౌలిక వసతులు లేవు.

● బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ మాటేమిటి ?

కావలి పెద్దచెరువును బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేస్తామన్న సీఎం హామీ ఊసేలేకుండా పోయింది. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా అభివృద్ధి చేస్తే దాదాపు 10 చెరువులకు నీటిని సరఫరా చేసుకుని సాగునీటికి ఇబ్బంది లేకుండా ఉంటుందన్న ఆశలు అడియాశలుగానే మిగిలాయి. అలాగే పట్టణ నడిబొడ్డున రూ. కోట్లు విలువ చేసే మార్కెట్ శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన మార్కెట్ సముదాయ భవనం నిర్మాణం చేపట్టేందుకు పాత భవనాన్ని కూల్చారు. ఇంతవరకు కొత్తదానికి అతీగతీలేదు. అలేడే పట్టణంలో రూ.10కోట్లతో ఉత్తరంవైపునున్న డంపింగ్ యార్డు స్థలంలో భారీ ఎత్తున నూతన పార్కు నిర్మాణం, బాహుజీనగర్‌లో నూతన పార్కు నిర్మాణం చేపడతామన్న వాగ్దానాలు నేటికి ఆచరణకు నోచుకోవలేదు.



ముసునూరు ఆటోనగర్ వద్ద అసంపూర్తిగా నిలిచిన కాలువ నిర్మాణ పనులు



అసంపూర్తిగా నిలిచిపోయిన ఫ్లైవోవర్ వంతెన నిర్మాణం

విత్తన డీలర్లపై చర్యలు

నెల్లూరు (వైద్యం) : నకిలీ విత్తనాలపై ఇటీవల ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనంతో సంబంధిత డీలర్లపై చర్యలు తీసుకుంటున్నట్లు వ్యవసాయ అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విడవలూరు మండలం అలగానిపాడులో ముగ్గురు రైతులు 17 బస్తాల బీపీటీ 5204 రకం వరి విత్తనాలను నెలూరు కావేరి సీడ్స్ నుంచి కొనుగోలు చేశారన్నారు. 34 ఎకరాల్లో ఆ విత్తనాలతో నారు పోసుకున్న తర్వాత 50 రోజుల్లో కంకులు రావటం గమనిం చిన రైతులు మండల వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేశారన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం శాస్త్రవేత్తల బృందం ఆ పంటను పరిశీలించి నివేదిక అందిస్తుందని పేర్కొన్నారు. నెల్లూరులోని కావేరి సీడ్స్ డీలర్ లైసెన్స్ రద్దు చేశామని, రైతులకు నష్టపరిహారం ఇప్పిస్తామని తెలియచేశారు.

అటవీ భూముల్లో అక్రమ మైనింగ్ జరగలేదు!

నెల్లూరు (వెంకటేశ్వరపురం): చేజర్ల మండలంలో అటవీ భూముల్లో ఎలాంటి తెల్లరాయి అక్రమ మైనింగ్ జరగడం లేదని రాపూరు రేంజ్ అటవీ అధికారి రవీంద్రబాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం ఆంధ్రజ్యోతిలో అడిగేది ఎవరు...అడ్డుకొనేది ఎవరు అన్న శీర్షికతో ప్రచురితమైన కథనంలో వెల్లడించినట్లు అటవీ భూముల్లో ఎక్కడా అక్రమ తవ్వకాలు జరగడం లేదన్నారు.

రా.. కదలిరా.. సభకు తరలిన టీడీపీ శ్రేణులు



ఉదయగిరి : జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న బయ్యన్న



చేజర్ల నుంచి...



కావలి టీడీపీ కార్యాలయం నుంచి రా...కదిలిరా సభకు బయలుదేరుతున్న టీడీపీ శ్రేణులు



సంగం నుంచి...



వింజమూరు నుంచి తరలిన కార్యకర్తలు

ఉదయగిరి రూరల్, జనవరి 28: నెల్లూరు ఎస్వీజీఎస్ కళాశాల మైదానంలో ఆదివారం నిర్వహించిన రా.. కదలిరా సభకు ఉదయగిరి, దుత్తలూరు మండలాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక వాహనాల్లో భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఉదయగిరి మండల వాహనాలకు మండల కన్వీనర్ సీహెచ్ బయ్యన్న జెండా ఊపి ప్రారంభించారు.

చేజర్ల : నెల్లూరు సభకు మండలం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. నాయకులు వేలూరు కేశవచౌదరి, మోదేపల్లి పెంచలనాయుడు, హజరత్, శ్రీనివాసులునాయుడు ఆధ్వర్యంలో నాగులవెల్లటూరు, చిత్తలూరు, చేజర్ల, కొట్టాలు, కాకివాయి, గొల్లపల్లి, ఏటూరు, ఏటూరుకండ్రిక తదితర గ్రామాల నుంచి కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు.

సంగం : మండలంలోని గ్రామాల నుంచి టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో నెల్లూరులో జరిగిన సభకు ఆదివారం బయలుదేరి వెళ్లారు. ఆటోలు, కార్లలో నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా బయలుదేరి వెళ్లారు.

వింజమూరు : నెల్లూరులో నిర్వహించిన టీడీపీ సభకు మండలంలోని పార్టీ కార్యాలయం నుంచి ఆదివారం ఉదయం పెద్ద సంఖ్యలో కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు. ఉదయగిరి ఇన్‌చార్జ్ బొల్లినేని రామారావు ఆదేశాల మేరకు కార్యకర్తలను తరలించినట్లు మండల అధ్యక్షుడు గొంగటి రఘునాథరెడ్డి తెలిపారు.

కావలి : నెల్లూరులో ఆదివారం నిర్వహించిన రా... కదిలిరా సభకు కావలి నుంచి ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. స్థానిక టీడీపీ కార్యాలయానికి చేరుకున్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సైకో పోవాలి.. సైకిల్ రావాలనింటూ నినాదాలు చేస్తూ ప్రత్యేక వాహనాలలో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, పోతుగంటి అలేఖ్య, జ్యోతి బాబూరావు, మొగిలి కల్లయ్య, దావులూరి దేవకుమార్, తోట వెంకటేశ్వర్లు, ఉప్పాల మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

అల్లూరు : నెల్లూరులో నిర్వహించిన రా.. కదలిరా.. సభకు అల్లూరు మండలం నుంచి తెలుగు తమ్ముళ్లు ఆదివారం స్వచ్ఛందంగా తరలి వెళ్లారు. స్థానిక సీనియర్ నేత బీద గిరిధర్ నేతృత్వంలో ఏ గ్రామాల నుంచి ఆ గ్రామ నాయకులు ఆధ్వర్యంలో ఆటోలు, మ్యాజిక్ వ్యాన్లు, కార్లు, ద్విచక్ర వాహనాలపై భారీగా తెలుగు తమ్ముళ్లు తరలి వెళ్లారు. తమ అధినాయకుడు తరలి వస్తున్న వేళ తామంతా ఏకతాటిపైకి వచ్చి ఎవరి బాధ్యతగా వారు తమ కేడర్‌ను తరలించి తమ బలాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకలు, కార్యకర్తలు చాలా ఉత్సాహంగా తరలి వెళ్లారు.

నేటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

ఆత్మకూరు, జనవరి 28 : ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ) ఆధ్వర్యంలో ఏపీ ఎస్‌పీడీసీఎల్ సంస్థ విద్యుత్ సంమస్యలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సోమవారం నుంచి మూడు రోజుల పాటు ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నట్లు ఆత్మకూరు విద్యుత్‌శాఖ డీఈఈ బీ జనార్దన్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన వార్షిక అదాయం, అవసరాలు, రిటైల్ ధరల మేరకు విద్యుత్ చార్జీలు తదితర అంశాలపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు తెలిపారు. పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో ప్రజల అభిప్రాయాలు తెలుపవచ్చని ఆయన పేర్కొన్నారు.

చివరి ఆయకట్టు వరకు సాగునీరు

సంగం, జనవరి 28: బెజవాడ పాపిరెడ్డి కాలువ (కావలి కాలువ) కింద జలదంకి మండలంలోని చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని ఉదయగిరి వైసీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఇరిగేషన్ అధికారులను కోరారు. ఆదివారం ఆయన రైతులతో కలిసి సంగం వద్ద ఉన్న బెజవాడ పాపిరెడ్డి కాలువ హెడ్‌రెగ్యులేటర్‌ను పరిశీలించారు. నీటి విడుదలను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. ప్రస్తుతం 500 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జలదంకి వైసీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సోమశిలలో 26.547 టీఎంసీల నీటి నిల్వ

అనంతసాగరం, జనవరి 28: సోమశిల పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, ఆదివారం నాటికి జలాశయంలో 26.547 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 2350, ఉత్తరకాలువకు 500, దక్షిణ కాలువకు 200 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

ఉదయగిరి రూరల్, జనవరి 28: మండలంలోని వెంగళరావునగర్‌లో నిర్వహించిన మెగా క్రికెట్ టోర్నమెంట్ పోటీల విజేతలకు ఆదివారం నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. పోటీల్లో మొత్తం 28 జట్లు తలపడ్డాయి. ఫైనల్‌లో విన్నర్‌గా నాగార్జున, రన్నర్‌గా కిశోర్ లెవన్స్ జట్లు నిలిచాయి. విన్నర్‌కు కాకర్ల చారిటబుల్ ట్రస్టు అధినేత కాకర్ల సురేష్ రూ.20,116లు, రన్నర్‌కు బీజేపీ నాయకులు ముడమాల రమేష్‌రెడ్డి రూ.15,116లు నగదు, ట్రోఫీలు అందజేశారు. అలాగే గండిపాళెం ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్ల మరమ్మతులకు రమేష్‌రెడ్డి రూ.5 వేలు వితరణ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ షేక్ రియాజ్, రాపల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కుంకుమార్చన



కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జనవరి 28: మండలంలోని నర్రవాడ వెంగమాంబ పేరంటాలమ్మ ఆలయం ఆధ్వర్యంలో జరుగుతున్న ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా ఆదివారం అష్టోత్తర పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు కుంకుమార్చనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి పల్లకీసేవ చేపట్టారు. నెల్లూరుకు చెందిన వై.లావణ్య బృందం అన్నమాచార్య కీర్తనలు ఆలకించారు. కార్యక్రమంలో ఈవో ఉషశ్రీ, ఉప ప్రధాన అర్చకులు బీపెద్దభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ సభగా ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం

● గెలిపిస్తే అభివృద్ధి ఏమిటో చూపిస్తా : రాంకుమార్



పొదుపు మహిళలకు చెక్కు అందచేస్తున్న రాంకుమార్‌రెడ్డి

కలువాయి, జనవరి 28: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన వైయస్ఆర్ ఆసరా నాల్గవ విడత సంబరాలు ఆద్యంతం రాజకీయ సభను తలపించింది. ఈసారి మాత్రం అధికారులు ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఎన్నికల సమయం కావడంతో హాజరైన మహిళలకు తాగు నీరు, భోజన వసతి ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. మండలంలోని 7,119 మంది మహిళలకు ప్రభుత్వం రూ.4.77కోట్ల చెక్కును కలువాయి మండల సమాఖ్య సభ్యులకు అందచేసింది. ఈ సందర్భంగా జరిగిన సభలో వైసీపీ వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి మాట్లాడుతూ తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయన చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌పై కూడా విమర్శలు చేయడంతో ఆసరా సభ రాజకీయ సభగా మారింది. సభ ముగియడంతో మహిళలంతా ఒక్కసారిగా భోజనాల వద్దకు వెళ్లడంతో అక్కడ తోపులాట జరిగింది. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, జడ్పీటీసీ బీ అనిల్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ ఆర్.లక్ష్మీదేవి, సర్పంచు పెంచలమ్మ, వైసీపీ మండల కన్వీనర్ మాకిరెడ్డి కృష్ణారెడ్డి, చల్లా సుబ్బరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వింజమూరు రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి తదితరులు

ఆత్మకూరు, జనవరి 28: ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాలను కలుపుతూ ఆత్మకూరు నుంచి వింజమూరు వరకు ఉన్న రోడ్డును రూ. 9 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. ఆత్మకూరు సమీపంలోని నెల్లూరుపాళెం వద్ద రోడ్డు నిర్మాణానికి ఆదివారం ఆయన ఉదయగిరి వైసీపీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు పనులను త్వరగా పూర్తి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, జేఏసీ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ జీ వెంకటరమణమ్మ, వైస్‌చైర్మన్లు డాక్టర్ కెవి శ్రావణ్‌కుమార్, షేక్ సర్దార్, పలువురు కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాక్కు శుద్ధి కలవారే బ్రహ్మజ్ఞాని

వింజమూరు, జనవరి 28 : వాక్కు శుద్ధి కలవారే బ్రహ్మజ్ఞాని అని పుత్తూరు సీనియర్ పిరమిడ్ మాస్టర్ రవిరాజ్ అన్నారు. వింజమూరులోని శ్రీ వేదవ్యాస వశిష్ట పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆదివారం ఆత్మజ్ఞానం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన వాక్కు శుద్ధి ద్వారా మాత్రమే జ్ఞానం కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ అఖండమైన ధ్యాన సాధన ద్వారా వాక్కు శుద్ధి పెంపొందించుకోవాలన్నారు. అనంతరం శాకాహారం ప్రాముఖ్యతను గురించి తెలియజేస్తూ కరపత్రాలు పంచుతూ, నినాదాలు చేస్తూ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, రవిచంద్ర, మహేశ్వర, హజరత్, తిరుపతిరావుఆచారి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న పిరమిడ్ ధ్యానులు

అక్రమ కట్టడాలకు అడ్డేది?



ఏరియా వైద్యశాల ప్రహరీ దాటి 2 అడుగులు ముందుకు వచ్చి నిర్మిస్తున్న దుకాణం

కావలి, జనవరి 28: కావలి పట్టణ నడిబొడున ఏరియా వైద్యశాల పక్కన ఒక వ్యాపార దుకాణం రోడ్డు మీదకు వచ్చేలా అక్రమ నిర్మాణం జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. పక్కన ఉన్న ఏరియా వైద్యశాల ప్రహరీ దాటి రెండడుగులు ముందుకు నిర్మాణం జరుగుతున్నా అధికారులు కళ్లప్పగించి చూస్తున్నారే కానీ దానిని నిరోదించలేకపోవడం వెనుక అంతర్యమేమిటో అర్థం కావటం లేదు. నిత్యం ప్రజలు, అధికారులు తిరిగే చోటే ఇలా రోడ్డుపైకి కట్టడాలు వస్తున్నా పట్టించుకోవడం లేదంటే ఇక పట్టణంలో సందులు, గొందుల్లో ఎలా నిర్మాణాలు జరిగినా అడిగేవారు లేరని తెలుస్తోంది. వాస్తవంగా పట్టణంలో ఉన్న ప్రధాన ట్రంకు రోడ్డుకు ఇరువైపులా వ్యాపార దుకాణాలు వెలసి ఉన్నాయి. అయితే వారు వినియోగదారులను దృష్టిలో పెట్టుకుని పార్కింగ్‌కు స్థలం వదిలితేనే మున్సిపాల్టీ అనుమతులు ఇవ్వాల్సి ఉంది. వినియోగదారులు సంగతి అలా ఉంచి వ్యాపార దుకాణ యజమానులు కూడా తమ వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు స్థలం వదలక పోవటంతో వారి వాహనాలు నిత్యం రోడ్డుపైనే ఉంటున్నాయి. వాస్తవంగా వినియోగదారులు వాహనాలు వస్తువులు కొనుగోలు చేసుకునే వరకే రోడ్డు మీద పార్కింగ్ చేసి తర్వాత వాటిని తీసుకు వెళ్లతారు. కానీ దుకాణాల యజమానుల వాహనాలు ఉదయం దుకాణం తీసినది మొదలు రాత్రి మూసే వరకు రోడ్డు మీదనే పార్కింగ్ చేసి ఉండటంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీంతో వ్యాపార దుకాణదారులు తమ వాహనాలకైనా పార్కింగ్ ఉండే విధంగా నిర్మాణాలు చేసుకోవాల్సింది పోయి రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోక పోవటం దారుణం.

పరిశీలించి నిర్మాణం వెనుకకు జరిపిస్తాం

రోడ్డు మీదకు వచ్చి జరుగుతున్న నిర్మాణాలను పరిశీలించి వాటిని వెనుకకు జరిపి నిర్మాణాలు జరిగేట్లుగా చర్యలు చేపడతాం.

- బాబూరావు, పట్టణ ప్రణాళిక అధికారి, కావలి

అంతర్జాతీయ విలువిద్య పోటీలకు మణిదీప్‌రెడ్డి



విలువిద్య పోటీలకు ఎంపికైన మణిదీప్‌రెడ్డి

లింగసముద్రం, జనవరి 28 : అమెరికాలో జరిగే అంతర్జాతీయ విలువిద్య పోటీలకు లింగసముద్రంకు చెందిన గొర్రెపాటి మణిదీప్‌రెడ్డి ఎన్నికయ్యాడు. ఫిబ్రవరి 1 నుంచి 4వ తేదీ వరకు జరిగే మెగా షూట్‌లో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్ జట్టులో మణిదీప్‌రెడ్డి స్థానం సంపాదించాడు. లింగసముద్రం పంచాయతీ వాకమళ్లవారిపాలెంకు చెందిన మణిదీప్‌రెడ్డి గత డిసెంబరు నెలలో పంజాబ్‌లో జరిగిన ఆల్ ఇండియా యూనివర్శిటీ చాంపియన్‌షిప్ పోటీల్లో కృష్ణా యూనివర్శిటీ నుంచి పాల్గొన్నాడు. జనవరి 4 నుంచి 6వ తేదీ వరకు చత్తీస్‌ఘడ్ రాష్ట్రం రాయపూర్‌లో జరిగిన జాతీయస్థాయి సబ్ జూనియర్ పోటీలలో పాల్గొని ఎన్ఆర్ఐటీకి క్వాలిఫై అయ్యాడు. మణిదీప్‌రెడ్డిని ప్రోత్సహిస్తున్న రామయ్య ఫౌండేషన్ ట్రస్ట్ చైర్‌పర్సన్ ఉన్నం నళినీదేవి, హరిబాబు దంపతులకు మణిదీప్ తలిదండ్రులు విజయభాస్కర్‌రెడ్డి, పార్వతిలు కృతజ్ఞతలు తెలిపారు.

ఈవీఎంలను వ్యతిరేకిస్తూ 31న ఢిల్లీలో ధర్నా

కందుకూరు, జనవరి 28: భారత్ ముక్తి మోర్చా ఆధ్వర్యంలో ఈవీఎంలను వ్యతిరేకిస్తూ ఈనెల 31న ఢిల్లీలోని ఎన్నికల కమిషన్ కార్యాలయం వద్ద భారీ ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బీఎంఎం జిల్లా అధ్యక్షుడు జహీర్ తెలిపారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో ఈవీఎంలు వద్దు బ్యాలెట్ పేపరే ముద్దు నినాదంతో గోడపత్రికను ఆవిష్కరించారు. కొప్పోలు ధనుంజయరావు, ఫైరోజ్, మెండా నాగరాజు, మోహన్ పాల్గొన్నారు.

గోడపత్రిక ఆవిష్కరణ



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు

వలేటివారిపాలెం : వలేటివారిపాలెం బస్టాండు సెంటరులో బాంసెఫ్ నాయకులు ఆదివారం బాంసెఫ్ గోడపత్రికను ఆవిష్కరించారు. భారత్ ముక్తి మోర్చా అధ్యక్షుడు గడ్డం వెంకట్రావు మాట్లాడుతూ భారత్ ముక్తి మోర్చా జాతీయ అధ్యక్షుడు వామన్‌మేశ్రా పిలుపు మేరకు ఈ నెల 31న ఢిల్లీలో ఈవీఎంలతో మోసాలపై ధర్నా జరుగుతుందని చెప్పారు. నాయకులు పురుషోత్తం, అనిల్ కుమార్, కూడలి భాస్కర్‌రావు, సాదు చెన్నకేశవులు, మాధవరావు, కనకాద్రి, చైతన్య కిరణ్, ప్రసాద్, మోహన్, సన్ని తదితరులు పాల్గొన్నారు.

5న బీటీఏ ఆధ్వర్యంలో చలో విజయవాడ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బీటీఏ నాయకులు

కందుకూరు, జనవరి 28: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 5న నిర్వహించ తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.మోహనరావు కోరారు. ఆదివారం స్థానిక బీటీ ఏ డివిజన్ కార్యాలయంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీటీఏ నాయకులు మేడికొండ భాస్కరరావు, దార్ల కోటేశ్వరరావు, సీహెచ్‌పీ బ్రహ్మయ్య, ఎం. రమణయ్య, పున్నేపల్లి శ్రీనివాసరావు, కసుకుర్తి అంజయ్య, కొచ్చర్ల వెంకటేశ్వర్లు, కళ్లగుంట యలమంద, దన్యాసి కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, రమణయ్య, పులి రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి

● ఐఎంఏ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర నేత శ్రీదేవి

కావలిటౌన్, జనవరి 28: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని ఐఎంఏ గౌరవ సలహాదారుడు డాక్టర్ బెజవాడ రవికుమార్ చించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కావలి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పాతూరులోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ముందుగా యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు శ్రీదేవిని సత్కరించారు. ఐఎంఏ గౌరవ సలహాదారుడు డాక్టర్ బెజవాడ రవికుమార్ మాట్లాడుతూ క్విజ్ పోటీల వల్ల విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మతను వెలికి తీయవచ్చన్నారు. ఐఎంఏ కావలి శాఖ అధ్యక్షుడు డాక్టర్ కె సుబ్బారావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లుకోదర్, డైరెక్టర్లు వెంకయ్య, నందనవనం మధుసూదన్‌రావు, జేవీవీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు పాపిశెట్టి జానకిరామ్ పాల్గొన్నారు.

వీరభద్రయ్య స్వామికి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో వీరభద్రయ్య స్వామి

కావలి రూరల్, జనవరి 28: కావలి పట్టణం బాలక్రిష్టారెడ్డి నగర్‌లో వెలసిన మడియాల్ వీరభద్రయ్య స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించి వాహనంలో కొలువుదీర్చి బాలక్రిష్టారెడ్డి నగర్ వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం చాకలి రేవు బండను పసుపు, కుంకుమతో పూజించి పొంగళ్ల నైవేద్యాలుగా సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని రజకులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం



మాట్లాడుతున్న పసుపులేటి సుగుణమ్మ

కావలిటౌన్, జనవరి 28: పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించేందుకు ముందుటామని పీఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పసుపులేటి సుధాకర్ సతీమణి సుగుణమ్మ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పీఎస్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ ప్రభాకర్‌నాయుడు ఆసుపత్రిలో ఉచిత మెగా లివర్ స్క్రీనింగ్ పరీక్షలు, కాలేయ వ్యాధులపై అవగాహన కార్యక్రమం జరిగింది. డాక్టర్ ప్రభాకర్ నా యుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రంలో సుగుణమ్మ మాట్లాడుతూ తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు అందుబాటులో లేని ఖరీదైన లివర్ స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా చేయించడం సంతోషంగా ఉందన్నారు. ప్రముఖ లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ నిపుణులు డాక్టర్ రజనీకాంత్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో అనేక మంది లివర్ వ్యాధిగ్రస్థులుగా మారుతున్నారని, ప్రధానంగా లివర్ కేన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో చెన్నై గ్లెనిగల్స్ హెల్త్ సిటీ వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, డాక్టర్ హలీమౌలాలి పాల్గొన్నారు.



నెల్లూరు : ఎమ్మెల్యే ఆనం, మాలేపాటిలతో పసుపులేటి సుధాకర్

ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుకై నేటి నుంచి న్యాయవాదుల రిలే దీక్షలు

కందుకూరు, జనవరి 28: ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టును తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కందుకూరులో న్యాయవాదులు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 7వ తేదీ వరకు రిలే నిరాహార దీక్షలకు సిద్ధమైనట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాల్లపల్లి మల్లికార్జునరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహిస్తున్న క్రమంలో న్యాయవాదులు సోమవారం నుంచి కోర్టు విధులను బహిష్కరించి స్థానిక కోర్టు కాంప్లెక్స్ వద్ద రిలే నిరాహార దీక్షలు ప్రారంభించాలని నిర్ణయించామని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమాలకు అన్ని రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలు, మేధావులు, ప్రజలు మద్దతు తెలపాలని కోరారు.

బాలికపై అత్యాచార యత్నం

లింగసముద్రం, జనవరి 28 : మానసిక దివ్యాంగురాలైన 12 ఏళ్ల బాలికపై 60 ఏళ్ల వృద్ధుడు అత్యాచార యత్నానికి పాల్పడిన ఘటన ఆదివారం మధ్యాహ్నం లింగసముద్రంలో జరిగింది. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో మూత్ర విసర్జనకు వెళ్లిన బాలిక ఎంతసేపటికీ రాకపోవడంతో ఆ బాలిక తల్లి గాలింపు చేపట్టింది. ఇంతలో వృద్ధుడి నుంచి తప్పించుకున్న ఆ బాలిక ఓ ఇంట్లో నుంచి ఏడుస్తూ వచ్చి జరిగిన విషయాన్ని తల్లికి చెప్పింది. దీంతో తల్లి, వారి బంధువుతో కలసి ఆ వ్యక్తిని నిలదీయగా వారి మధ్య వాగ్వివాదం జరిగింది. దీంతో బాలిక తల్లి స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో గుడ్లూరు సీఐ బీవీవీ సుబ్బారావు సంఘటన జరిగిన ఇంటిని పరిశీలించారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఆయన వెంట వలేటివారిపాలెం ఎస్సై మహేంద్రనాయక్ ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

లింగసముద్రం, జనవరి 28 : మండలంలోని అన్నెబోయినపల్లి గ్రామ సమీపంలోని మన్నేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. అందిన సమాచారం మేరకు పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో ఏ మల్లికార్జున, సిబ్బంది ఆదివారం ఉదయం దాడులు చేసి మన్నేరులో ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను, డ్రైవర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్టు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

కావలిటౌన్, జనవరి 28: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆదివారం పాతూరు కృష్ణుడి ఆలయం వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు కె.బ్రహ్మానందం, రాష్ట్ర కౌన్సిలర్ వింతా రంగారెడ్డి, వైసీపీ నాయకులు జనిగర్ల మహేంద్ర యాదవ్‌లు పాల్గొని కేంద్ర పథకాలకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుసు వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, మంద కిరణ్, సవీంద్ర, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు ఎస్ఐగా ఆనంద్‌భాస్కర్

కందుకూరు, జనవరి 28: కందుకూరు పట్టణ ఎస్ఐ హనీఫ్‌ను వీఆర్‌కు బదిలీ చేస్తూ ఆదివారం సాయంత్రం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన స్థానంలో నెల్లూరు దిశ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా ఉన్న ఆనంద్‌భాస్కర్‌ను పట్టణ ఎస్ఐగా నియమించారు. హనీఫ్ కందుకూరు పట్టణ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన కొద్దినెలకే ఆయనపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. స్టేషన్‌కు వచ్చే ప్రజల పట్ల కూడా ఆయన న్యాయం చేయాలన్న భావనతో కాకుండా అధికారం చెలాయించి డ బ్బు వసూలు చేసుకోవడం, సెటిల్‌మెంట్లు చేయడం లాం టి పలు ఆరోపణలు వచ్చాయి. ఇటీవల సంక్రాంతి పర్వది నం సందర్భంగా కూడా పేకాట, ఇతర జూదరులను పట్టుకున్న సమయంలో చేతివాటం చూయించారన్న విమర్శలపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో విచారించిన ఉన్నతాధికారులు ఆయనను వీఆర్‌కు పంపిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

బిట్రగుంట, జనవరి 28: గణతంత్ర దినోత్సవం రోజున అవార్డు అందుకున్న ముగ్గురు వాకర్స్ సభ్యులు డాక్టర్ కొర్రాచంద్రశేఖర్, మాజీ సైనికుడు వై.విజయప్రతాప్‌రెడ్డి, కానిస్టేబుల్ గుత్తి ప్రభాకర్‌లను బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడామైదానంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాకర్ అసోసియేషన్ అధ్యక్షుడు శశికుమార్, గౌరవ అధ్యక్షుడు ఏకే.సుందర్‌రాజ్, సభ్యులు కే.శ్రీనివాసులు, సత్యనారాయణాచార్యులు, శ్యాంసుధాకర్, బర్నాడ్, రవికాత్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

తూపిలి పెంచలయ్యకు నివాళి

బిట్రగుంట, జనవరి 28: ప్రజా నాయకుడు తూపిలి పెంచలయ్యకు కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఘన నివాళులర్పించారు. రెండు సార్లు బోగోలు సర్పంచుగా పనిచేసిన ఆయన ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. దీంతో ఆదివారం బోగోలు పంచాయతీ కార్యాలయ ఆవరణలో జరిగిన సంతాప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైసీపీ మండల కన్వీనర్ వీరరఘు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకుడు పీ.శ్రీరాములు, పీఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పసుపులేటి సుధాకర్ ముఖ్యఅతిధులుగా పాల్గొన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరావు, సీపీఎం మండల కార్యదర్శి తుమ్మల వెంకయ్య, పీఎసీఎస్ అధ్యక్షుడు ఎస్.మాల్యాద్రి, మాజీ సర్పంచు అంకులయ్య, వైసీపీ నాయకులు శ్రీనివాసులు, లక్ష్మీరెడ్డి, మా చర్ల, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు : ఎమ్మెల్యే

దగదర్తి(బిట్రగుంట), జనవరి 28: ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించేందుకు ప్రభుత్వం పలు కార్యాలయాలను ఏర్పాటు చేసిందిని కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి అన్నారు. దగదర్తి మండలం దుండిగంలో నూతన సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ సెంటర్లను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఎంపీపీ తాళ్లూరి వెంకటకృష్ణ ప్రసాద్‌నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచు బాలయ్య నాయుడు, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ అనిల్, మండల యువత అధ్యక్షుడు మహేష్‌నాయుడు, ఎంపీటీసీలు, వైసీపీ నేతలు పాల్గొన్నారు.

చంద్రబాబు సభకు భారీగా తరలిన టీడీపీ శ్రేణులు



ఇందుకూరుపేట : నెల్లూరుకు తరలివెళ్తున్న టీడీపీ నాయకులు



బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చి నుంచి బయలుదేరుతున్న టీడీపీ శ్రేణులు

కోవూరు, జనవరి 28: నెల్లూరు నగరంలోని ఎస్వీజీఎస్ కళాశాల ఆవరణలో ఆదివారం టీడీపీ అధినేత చంద్రబాబు నిర్వహించిన రా.. కదలిరా సభకు మండలంలోని గ్రామాల నుంచి టీడీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. కోవూరు, పోతిరెడ్డిపాళెం, పడుగుపాడు, గంగవరం, వేగూరు, ఇనమడుగు తదితర గ్రామాల నుంచి టీడీపీ నాయకులు ఇంతా మల్లారెడ్డి, తిరుమూరు అశోక్‌కుమార్‌రెడ్డి, కొల్లారెడ్డి సుధాకరరెడ్డి, జెట్టి రాజగోపాలరెడ్డి, బాల రవి, నాటకరాని వెంకట్ తదితరుల నాయకత్వంలో పెద్దసంఖ్యలో కార్యకర్తలు మోటారు బైక్‌లు, ఆటోలు, కారుల్లో సభాస్థలికి తరలివెళ్లారు.

ఇందుకూరుపేట : మండలంలోని అన్ని గ్రామాల నుంచి వేల సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ మండల కన్వీనర్ రావెళ్ల వీరేంద్రచౌదరి ఆధ్వర్యంలో నెల్లూరు ఎస్వీజీఎస్ కాలేజీ మైదానంలో జరిగే రా కదిలిరా సభకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో మునగాల రంగారావు, ఇంతియాజ్, కూకటి వెంకటేశ్వరరెడ్డి, కుమార్, రామచంద్రయ్య, ఈదూరు చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం : నెల్లూరులో జరిగిన చంద్రబాబు సభకు బుచ్చి మండలం నుంచి వేల సంఖ్యలో టీడీపీ శ్రేణులు, అభిమానులు ఆటోలు, కార్లు, వ్యాన్లు, బైక్‌లలో ర్యాలీగా తరలివెళ్లారు. ముందుగా అందరూ కాళయకాగొల్లు కూడలికి చేరుకుని అక్కడి నుంచి తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎంవీ.శేషయ్య, బత్తల హరికృష్ణ, రామానాయుడు, హరనాథ్, సంజీవరెడ్డి, కొండయ్య, కృష్ణారెడ్డి, శంకర్, దశరథ, భాస్కర్, శశి, ఉమ్మయ్య, పెంచలయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

వెంకటాచలం: నెల్లూరులోని ఎస్వీజీఎస్ కళాశాల మైదానంలో ఆదివారం జరిగిన రా...కదిలిరా సభకు మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సారథ్యంలో మండలం నుంచి పలు వాహనాల్లో తరలివెళ్లినట్లు ఆపార్టీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ తెలిపారు.

పోలీసు క్వార్టర్స్ స్థల ఆక్రమణ



సీఐ నివాసగృహం ఆవరణలో పుచ్చకాయల దుకాణం

కోవూరు, జనవరి 28 : స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణకు సమీపంలోని పోలీసు క్వార్టర్స్ స్థలాన్ని పలు దుకాణాల యజమానులు ఆక్రమిస్తున్నారు. సర్కిల్ ఇన్‌స్పెక్టరు నివాస గృహ ఆవరణలో పుచ్చకాయల దుకాణాన్ని ఏర్పాటు చేస్తున్నప్పటికీ పోలీసులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలకు దారి తీస్తోంది. ఇక్కడ పనిచేసే సీఐలు తమకు కేటాయించిన క్వార్టర్స్‌లో నివాసం ఉండకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తినట్లు భావిస్తున్నారు. ఏకంగా సీఐ నివాస గృహంలోకి వెళ్లే దారిలో పుచ్చకాయల దుకాణాన్ని ఏర్పాటును అడ్డుకున్న స్థానికులపై దుకాణం యజమాని దురుసుగా ప్రవర్తించాడు. దీంతో పోలీసు క్వార్టర్స్ ఆక్రమణ పోలీసుల కన్నుసన్నల్లోనే సాగుతోందని భావిస్తున్నారు. కనీసం పోలీసులైనా తమ ఆస్తుల్ని కాపాడుకోవాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు.

జగనన్నా.. ఇళ్లు ఎప్పుడు నిర్మిస్తారు ?

- మండలంలో 4,879 ఇళ్లనుగానూ పూర్తయింది 352
- ప్రారంభించని గృహాలు 2,336

పొదలకూరు, జనవరి 28 : ఇళ్ల స్థలాలు ఇవ్వడమే కాదు... కోరుకుంటే ఇంటిని కట్టిస్తాం... అంటూ మాటలు చెప్పిన వైసీపీ నేతలు మండలంలో వేలాదిమంది సొంతింటి కలను తీరని కలగా మిగిల్చారు. పొదలకూరు పరిధిలోని సర్వే నెంబరు 707లో చిట్టేపల్లి తిప్ప వద్ద పట్టణానికి చెందిన 1,107 మందికి ఇళ్ల ప్లాట్లు మంజూరు చేశారు. వీరిలో 465 మంది లబ్ధిదారులకు కాంట్రాక్టర్ ద్వారా ఫస్ట్ ఫేస్ ఇల్లు తామే నిర్మిస్తామని చెప్పారు. ఈ ఇళ్లలో ఇప్పటికీ కేవలం 20 ఇళ్లు మాత్రమే శ్లాబులు వేశారు. మండలంలోని 60 జగనన్న లేఅవుట్లలో 4879 ఇళ్లు నిర్మించాల్సి ఉంది. అయితే ఇప్పటివరకు 2,336 ఇళ్ల నిర్మాణం అసలు ప్రారంభమే కాలేదు. 515 ఇళ్లు బేస్మెంట్ వరకు వేసి వదిలేశారు. మండలంలో 4,879 ఇళ్లకుగాను ఇప్పటి వరకు నిర్మించినవి 352 ఇళ్లు మాత్రమే. జగనన్న కాలనీల్లో ఇంటింటికి కుళాయి, తాగునీరు. రోడ్లు, వీధి బల్బులు లాంటి మౌలిక సదుపాయాలను ఇంతవరకు సమకూర్చలేదు. ప్రభుత్వమే ఇల్లు కట్టించి ఇస్తుందన్న ముఖ్యమంత్రి జగన్ ప్రకటనతో దాదాపుగా అందరూ అటువైపే మొగ్గుచూపారు. కేంద్రమిచ్చే రూ.1.80లక్షలతో (పట్టణాల్లో మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం రూ.30వేలు ఇస్తుంది) ఇళ్లు కట్టించి ఇస్తారో! లేదో అని మండల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మరో రెండు నెలల కాలంలో ఇళ్లు ఇస్తారా లేదా అని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇళ్ల నిర్మాణం త్వరగా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



చిట్టేపల్లి తిప్ప వద్ద ఇంకా బేస్మెంట్ లెవల్ దాటని జగనన్న ఇళ్లు

కొండూరుకు పరామర్శ

మనుబోలు, జనవరి 28: మండలంలోని మడమనూరు వైసీపీ నాయకులు కొండూరు రామచంద్రారెడ్డిని ఆదివారం రాష్ట్రమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పరామర్శించారు. రామచంద్రారెడ్డి తల్లి సరోజనమ్మ (94) అనారోగ్యంతో మృతిచెందింది. దీంతో మంత్రి కొండూరు నివాసానికి చేరుకుని ఆమెకు నివాళులు అర్పించారు. అనంతరం రామచంద్రారెడ్డిని, కుటుంబసభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మనుబోలు పీఏసీఎస్ చైర్మన్ మారంరెడ్డి ప్రదీప్‌రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

95 శాతం కులగణన పూర్తి

తోటపల్లిగూడూరు, జనవరి 28: మండలంలోని వరిగొండ సచివాలయం-1 పరిధిలో 95శాతం కులగణన పూర్తి అయిందని, గ్రామంలో అందుబాటలో లేనివారి కోసం ప్రభుత్వం సోమవారం నుంచి మరో ఐదు రోజుల పాటు అవకాశం ఇచ్చిందని సచివాలయ ప్రత్యేకాధికారి పీవీఎస్టీ రాంప్రసాద్ తెలిపారు. నమోదు కానివారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సర్వేపల్లిలో కాకాణిపై తిరుగుబాటు : సోమిరెడ్డి

- రామదాసుకండ్రిగలో 100 కుటుంబాలు టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన వారితో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

వెంకటాచలం, జనవరి 28 : సర్వేపల్లి నియోజకవర్గంలో మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిపై తిరుగుబాటు ప్రారంభమైందని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని రామదాసుకండ్రిగ పంచాయతీలో ఆదివారం రాత్రి వైసీపీ నేత చాట్ల వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో 50 కుటుంబాలు, నాయుడుపాళెంలో వైసీపీ నేత మల్లి నరసయ్య ఆధ్వర్యంలో 50 కుటుంబాలు వైసీపీని వీడి సోమిరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి సోమిరెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదారంగా ఆహ్వానించారు. తొలుత భారీ మోటార్ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ పోలీసులకు కాకి చొక్కాలు శాశ్వతం కాదన్నారు. కాకాణి కింద గుమస్తాలుగా పని చేయవద్దన్నారు. కాకాణిపై లెక్కకు మించినని ప్రైవేటు కేసులు ఉన్నాయని, వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. రామదాసుకండ్రిగలోనే రాబోవు ఎన్నికల్లో టీడీపీకి 250 ఓట్లకి పైగా మెజార్టీ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాజాయాదవ్, నాగేంద్రప్రసాద్, రాధాకృష్ణమనాయుడు, శ్రీనివాసులునాయుడు, నాగార్జున్‌రెడ్డి, రమేష్‌నాయుడు, సురేష్‌నాయుడు, కోదండయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు గ్రామంలో బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

యువత క్రీడా స్ఫూర్తి కలిగి ఉండాలి



క్రికెట్ విజేతలకు షీల్డు అందచేస్తున్న నిర్వాహకులు

రాపూరు(డక్కిలి), జనవరి 28 : యువత క్రీడాస్ఫూర్తి కలిగి ఉండాలని రాపూరు పట్టణ టీడీపీ ఉపాధ్యక్షుడు ఖాజా మోహిద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన క్రికెట్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల వల్ల శారీరక దారుఢ్యంతోపాటు మంచి నడవడిక అలవడుతుందన్నారు. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో స్టూడెంట్ క్లబ్ టీం విన్నర్‌గా నిలవగా ఆ జట్టుకు రూ.21,116, రన్నర్‌గా నిలిచిన ఫ్రెండ్స్ అసోసియేషన్ జట్టుకు రూ.15,116 నగదు, షీల్డు అందచేశారు. ఈ కార్యక్రమంలో పోసిన రాము, కూరాకు సాయి, ఆర్‌పీ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోనే జీవిత పాఠాలు

- టీడీపీ నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్



బహుమతి ప్రదానం చేస్తున్న అబ్దుల్ అజీజ్

ఇందు కూరు పేట, జనవరి 28 : క్రీడలతో జీవిత పాఠాలు ముడిపడి ఉన్నాయని మాజీ మేయర్, టీడీపీ నెల్లూరు పార్లమెంట్ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. ఆదివారం పల్లిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో బసవ రామతారకం మెమోరియల్ కమిటీ చైర్మన్ జానా గిరిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన 37వ నందమూరి బసవ రామతారకం మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. అనంతరం జరిగిన బహుమతి ప్రదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఎన్ఎస్ఆర్‌పీసీ దేవిస్‌పేట జట్టుకు ప్రథమ బహుమతి, పల్లిపాడు సీసీ జట్టుకు ద్వితీయ బహుమతి అందజేశారు. 37 ఏళ్లుగా నందమూరి కుటుంబం మీద అభిమానంతో నిర్విరామంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్న జానా గిరిబాబును అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలకృష్ణ ఫ్యాన్స్ అధ్యక్షుడు మంచికంటి సుధాకర్, కుడుముల చిరంజీవి, మధుబాబు, పొత్తూరు శైలజ, బ్రహ్మయ్య, పీఈటీ లక్ష్మయ్య, మునగాల రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసి, ఆదరించమంటున్నాం : మంత్రి కాకాణి

ముత్తుకూరు, జనవరి 28 : ఐదేళ్ల పాలనలో ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేసి ఆదరించమంటున్నామని రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. కృష్ణపట్నంలో ఆయన ఆదివారం పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. స్థానిక నాయకులు రాగాల వెంకటేశ్వర్లు, రాగాల కోదండం, ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో వైసీపీలో చేరిన వారిని కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కృష్ణపట్నంలోనే రూ.50కోట్లకుపైగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. అంతకుముందు ముత్తుకూరు షాదీమంజిల్‌లో సింహపురి కరాటే అకాడమీ ఆధ్వర్యంలో శిక్షకులు ధనుష్ ఏర్పాటు చేసిన సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ శిబిరాన్ని కాకాణి ప్రారంభించారు. కార్యక్రమంలో మండల వైసీపీ కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు రాగాల వెంకటేశ్వర్లు, శివప్రసాద్, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, లక్ష్మణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఆర్ గిరిజన కాలనీలో అభివృద్ధి పనులు



పంచేడు పరిధిలోని ఎన్ఎస్ఆర్ గిరిజన కాలనీలో ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న ముళ్లపొదలు

బుచ్చిరెడ్డి పాళెం. జనవరి 28 : మండలంలోని పంచేడు పంచాయతీ నల్లపురెడ్డి శ్రీనివాసులురెడ్డి (ఎన్ఎస్ఆర్) గిరిజనకాలనీలో ఆదివారం అభివృద్ధి పనులు చేపట్టారు. ఎక్స్‌కవేటర్‌తో స్థానిక నాయకుడు టీప్రసాద్‌రెడ్డి ముళ్లపొదలు తొలగింపు, శిధిలావస్థలో ఉన్న ఆలయ పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీలో అభివృద్ధి పనులకు రూ.50 లక్షలు మంజూర య్యాయని, అందులో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, రూ.3 లక్షలతో డ్రైను నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఆయన చెప్పారు. ఆలయపునరుద్ధరణకు రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి రూ.2లక్షలు ఇచ్చినట్లు తెలిపారు. ఈ కాలనీతోపాటు పంచేడు తూర్పు గిరిజన కాలనీ, దళితవాడల్లో కూడా సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

సైకిల్ సంబరం

రా.. కదలిరా పేరుతో ఆదివారం నగరంలో నిర్వహించిన చంద్రబాబు సభ టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది.



చంద్రబాబుకు ఎమ్మెల్యేలు ఆనం, కోటంరెడ్డి స్వాగతం.

పనబాక దంపతులు, అజీజ్, కోటంరెడ్డి సత్కారం

బాబుకు బొకే ఇస్తున్న మనుక్రాంత్

సార్.. సమస్యలివి ! చంద్రబాబుకు సమస్యలు తెలుపుతున్న పొంగూరు నారాయణ, డాక్టర్ జెడ్ఎస్, పోలంరెడ్డి దినేష్, సోమిరెడ్డి



చంద్రబాబు సమక్షంలో పలువురి చేరికలు



శివకుమార్‌రెడ్డికి కండువా కప్పుతున్న చంద్రబాబు

నెల్లూరు రూరల్ : నెల్లూరులో జరిగిన 'రా కదలిరా' కార్యక్రమంలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు సమక్షంలో పలువురు ఆ పార్టీలో చేరారు. నెల్లూరు రూరల్ మండలం గొల్లకందుకూరు, సజ్జాపురం గ్రామాల్లో బలమైనవర్గంతోపాటు సర్పంచ్, ఎంపీటీసీ, మార్కెట్ కమిటీ పదవుల్లో కొనసాగిన పొనక హరిప్రసాద్ రెడ్డి, శివకుమార్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్‌రెడ్డి, పెన్న వెంకురెడ్డి, తాటిపర్తి పుల్లయ్య తదితరులు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు గిరిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పసుపు కండువా కప్పుకున్నారు. వీరితోపాటు జిల్లాకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 28 : నగరంలోని ఎస్వీజీఎస్ కళాశాల మైదానంలో ఆదివారం జరిగిన తెలుగుదేశం పార్టీ రా.. కదలిరా మహాసభలో సాంస్కృతిక కార్యక్రమాలు పార్టీ శ్రేణులను అలరించాయి. పార్టీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు దోర్నాల హరిబాబు ఆధ్వర్యంలో ప్రదర్శనలు జరిగాయి. కళాకారులను చంద్రబాబు అభినందించారు.

జనసేన బలపరిచిన అభ్యర్థుల విజయమే లక్ష్యం!

- రౌండ్ టేబుల్ సమావేశంలో అభిమాన సంఘం నాయకులు



సమావేశంలో అభిమాన సంఘం నాయకులు

నెల్లూరు(స్టోన్ హౌ స్‌పేట), జనవరి 28: జనసేన పార్టీ బలపరిచిన అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతామని, ప్రతి ఇంటికి జనసేనాని మేనిఫెస్టోని తీసుకెళతామని ఆంధ్ర రాష్ట్ర పవన్‌కల్యాణ్ అభిమాన సంఘాల జిల్లాల అధ్యక్షులు ప్రకటించా రు. నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన పవన్‌కల్యాణ్ అభిమాన సంఘం నేతల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీ టోనిబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు ఉన్నత జీవన ప్రమాణాలను అందించాలనే మనోగతంతో కులమతాలకు అతీతంగా జనసేన పార్టీని పవన్‌కల్యాణ్ స్థాపించారన్నారు. జనసేన బలపరిచిన అభ్యర్థుల విజయం కోసం అభిమానులందరం అలుపెరుగని కృషి చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండ్రెడ్డి చందు, సురేష్, శివ, రవి, సోమశేఖర్, రామకృష్ణ, విజయ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ ఉద్యోగ సంఘం క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 28: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ ఉద్యోగుల సంక్షేమ సంఘం 2024 సంవత్సరానికి రూపొందించిన డైరీ, క్యాలెండరును వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. నగరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీ శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు రంగనాథబాబు, చైర్మన్ శేషారెడ్డి, పాపయ్య నాయుడు, సభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌డీసీసీబీ విశ్రాంత ఉద్యోగులకు గ్రూపు ఇన్సూరెన్స్ కావాలి

- ఉద్యోగ సంఘం నాయకుడు కాంతారావు



సమావేశంలో మాట్లాడుతున్న కాంతారావు

నెల్లూరు(హరనాథపురం), జనవరి 28 : నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (ఎన్‌డీసీసీబీ) విశ్రాంత ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగులకు ఇస్తున్నట్లే గ్రూపు ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేయాలని ఎన్‌డీసీసీబీ ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యదర్శి కాంతారావు కోరారు. ఆదివారం బ్యాంకులో ఆ సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలన్నారు. తమిళనాడు తరహాలో విశ్రాంత ఉద్యోగులకు రూ.5వేల ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఆప్‌కాప్ ఓ కమిటీని ఏర్పాటు చేసిందని, ఆ కమిటీ విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ ఇవ్వాలని తీర్మానించిందని చెప్పారు. ఈ సమావేశంలో సంఘం అధ్యక్షుడు పీ వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, రవి, సుధాకర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

మట్టిబండ కవితకు ప్రశంసలు



రచయిత ఆదినారాయణను సత్కరిస్తున్న అతిథులు

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 28 : నగరంలోని టౌనుహాలు రీడింగ్ రూమ్‌లో ఆదివారం రాత్రి మట్టిబండ దీర్ఘ కవిత పరిచయ కార్యక్రమం జరిగింది. చిన్ని నారాయణరావు అధ్యక్షత వహించారు. నాగభైరవ ఆదినారాయణ రచించిన మట్టిబండ కవితపై గంగిశెట్టి శివకుమార్, బీర సుందరరావు సమీక్ష చేశారు. రైతు చుట్టూ జరిగే వాస్తవాలను ఈ కవిత ద్వారా కళ్లముందుంచారని ప్రశంసించారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనం అలరించింది. రచయిత ఆదినారాయణ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీ జెన్‌కో విజిలెన్స్ డీఎస్పీ కొల్లూరు శ్రీనివాసులు, మెట్టు రామచంద్రప్రసాద్, ఎన్ తపస్వీ, పెరసం అధ్యక్షుడు అవ్వారు శ్రీధర్‌బాబు, గోవిందరాజు సుభద్రాదేవి, మోపూరు పెంచల నరసింహం, తోట సులోచన, తదితరులు పాల్గొన్నారు.

కమనీయం రంగనాథుడి కల్యాణం

- ముగిసిన 'భక్తుల వద్దకు భగవంతుడు'



నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 28 : నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో ఆదివారం విశేష కార్యక్రమాలు, ఉత్సవాలు జరిగాయి. ఉదయం తిరుమలిశై ఆళ్వారు జయం తి సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామికి తిరుమంజనం జరిగింది. స్వామి, అమ్మవార్లకు, ఆళ్వారుకు పేట ఉత్సవం వైభవంగా జరిగింది. రాత్రి రంగనాథస్వామి కల్యాణో త్సవం కనుల పండువగా జరిగింది. దేవదాయ ధర్మదాయ శాఖ, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న భక్తుల వద్దకు భగవంతుడు కార్యక్రమం ముగింపు సందర్భంగా ఆల యంలో ఈ వేడుక నిర్వహించారు. ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈవో డబ్బుగుంట వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

అందరూ కంటి పరీక్షలు చేయించుకోవాలి : ఆదాల

నెల్లూరు రూరల్, జనవరి 28 : వాతావరణం, ఆహారం, జీవన శైలి కారణంగా కంటి చూపు సమస్యలు తలెత్తే అవకాశాలున్నాయని, ప్రతి ఒక్కరు విధిగా కంటి పరీక్షలు చేయించు కోవాలని ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సూచించారు. ఆయన ఆదివారం మేయర్ స్రవంతితో కలిసి ధనలక్ష్మీపురంలో పర్యటించారు. స్థానిక జడ్పీ స్కూల్లో ఎల్వీ ప్రసాద్ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాన్ని వారు ప్రారంభించారు. స్వయంగా కంటి పరీక్షలు చేయించుకున్న ఆదాల మాట్లాడుతూ కంటి పరీక్షలు, చికిత్సతో మెరుగైన చూపును పొందవచ్చన్నారు. అనంతరం స్థానిక యువకులు కొందరు వైసీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, వైసీపీ సీనియర్ నేత కాటంరెడ్డి వేణుగోపా ల్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు జయవర్ధన్ పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐ కమిటీ సభ్యుడికి సత్కారం

నెల్లూరు(హరనాథపురం), జనవరి 28 : భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడిగా నియమితులైన దేసు విజయకుమార్‌ను ఎంఆర్‌పీఎస్ నాయకులు సత్కరించారు. ఎంఆర్‌పీఎస్ యూత్ జిల్లా అధ్యక్షుడు మర్లపాటి హరిప్రసాద్, నెల్లూరు సిటీ అధ్యక్షుడు పైడిపాటి చరణ్‌తేజ ఆదివారం నగరంలోని విజయకుమార్ నివాసానికి వెళ్లిన శాలువ, పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన నాయకులు గుబ్బ రాము, వారి మిత్రబృందం పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న కారు

- పలువురికి గాయాలు

నెల్లూరు రూరల్, జనవరి 28 : నెల్లూరు - జొన్నవాడ రహదారిపై దొడ్ల డెయిరీ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. స్థానికుల ద్వారా అందిన సమాచారం మేరకు... నెల్లూరు నుంచి పాతవెల్లంటికి వెళ్తున్న ఆటోను వెనుక వైపు నుంచి అతివేగంగా వచ్చిన కారు ఢీకొంది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న పలువురు గాయపడ్డారు. ప్రమాదానికి కారణమైన కారు రోడ్డు పక్కనే ఉన్న పంట పొలాల్లో బోల్తాపడింది. గాయపడ్డ వారిని స్థానికుల సహాయంతో నెల్లూరులోని పలు ఆసుపత్రులకు తరలిచ్చారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు అందాల్సి ఉంది.

పూర్వవిద్యార్థుల సమ్మేళనం

ఇందుకూరుపేట, జనవరి 28 : మండలంలోని నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1992-93 సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో గురువులను సన్మానించి పూర్వ విద్యార్థులు గత స్మృతులను గుర్తుచేసుకుని మురిసిపోయారు. బాబు, హర్ష, సురేఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.




నెల్లూరులోని ఎస్వీజీఎస్ కళాశాల మైదానంలో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్న టీడీపీ శ్రేణులు, అభిమానులు

తమ్ముళ్లలో జోష్

- నెల్లూరులో చంద్రబాబు సభ విజయవంతం
- టీడీపీ, జనసేన శ్రేణుల్లో కదనోత్సాహం నింపిన రా.. కదలిరా!
- మండుటెండను లెక్కచేయని అభిమానం
- ఆలోచింపజేసిన చంద్రబాబు ప్రసంగం



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న చంద్రబాబు





వేదికపై టీడీపీ శ్రేణులనుద్దేశించి ప్రసంగిస్తున్న చంద్రబాబు

నెల్లూరు (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో ఆదివారం జరిగిన రా.. కదలిరా..!!! సభ టీడీపీ, జనసేన పార్టీ శ్రేణుల్లో ఎన్నికల కదనోత్సాహం నింపింది. టీడీపీ అధినేత నారా చంద్రబాబు ప్రసంగం రాష్ట్ర భవిష్యత్తు పట్ల ప్రజలను ఆలోచింపజేసింది. వేలాదిగా తరలివచ్చిన జన సందోహం పసుపుదళంలో సంతోషాన్ని నింపగా, చంద్రబాబును చూడగానే ప్రజలు ఉద్వేగానికి లోనుకావడం రానున్న ఎన్నికల ఫలితాలను ప్రస్ఫూటింపజేసింది. ఒక్కమాటలో చెప్పాలంటే రా.. కదలిరా! బహిరంగ సభ విజయవంతమైంది. నెల్లూరు నగరం మొత్తం సభా ప్రాంగణమైన ఎస్వీజీఎస్ మైదానం వైపు మళ్లింది. ఉదయం పది గంటల నుంచే పార్టీ జెండాలు చేతబట్టిన టీడీపీ, జనసేన కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు సభా ప్రాంగణానికి చేరుకోవడం మొదలెట్టారు. సభ ప్రాంగణాన్ని కలిపే జాతీయ రహదారి నగరవాసుల తాకిడిని తట్టుకోలేక కిటకిటలాడింది. చంద్రబాబు వచ్చే సరికి మధ్యాహ్నం ఒంటి గంట అయ్యింది. అప్పటివరకు ప్రజలు మండుటెండను సైతం లెక్కచేయక ఎదురుచూశారు. చంద్రబాబు వేదికపైకి అడుగుపెట్టగానే సీఎం..సీఎం అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఐదేళ్లపాటు రాష్ట్రంలో ఎలా దోపిడీ జరిగింది, రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీ ఎలా శ్రమించింది చంద్రబాబు వివరించిన తీరు ఆకట్టుకుంది. టీడీపీ, జనసేన పార్టీల సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడటం ఎంత అవసరమో వివరించిన తీరు ప్రజలను ఆలోచింపజేసింది. రా.. కదలిరా! కార్యక్రమం ప్రజలకు మాత్రమే కాదని రాష్ట్ర భవిష్యత్తు కోసం తెలుగుదేశం, జనసేన పార్టీలతో కలిసి వచ్చే వైసీపీ నాయకులు, కార్యకర్తలను కూడా ఆహ్వానిస్తున్నామని చంద్రబాబు అన్న మాటలు కొత్త ఆలోచనలను కలిగించింది. జిల్లా నుంచి ఇంకా ఎవరైనా వైసీపీ నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకోవడానికి సిద్ధంగా ఉన్నారా!? అనే చర్చ మొదలయ్యింది.

ఇలాంటి ఎమ్మెల్యేలు అవసరమా!?

- బూతులు తిట్టిన వారికి పదవులు
- అభివృద్ధిపై నోరు తెరవని అనిల్
- కావలికి పట్టిన చెద రామిరెడ్డి
- డైలీ, వీక్లీ, మంత్లీ కలెక్షన్లలో ప్రసన్న
- అన్ని డీల్స్‌లో కాకాణిదే పైచేయి
- మైనింగ్ డీల్స్‌లో విక్రమ్
- ఎమ్మెల్యేలపై విరుచుకుపడ్డ చంద్రబాబు



మా పోర్టును కాపాడండి సార్.. : ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఆ పోర్టు సిబ్బంది

నెల్లూరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): 'ప్రజాప్రతినిధులు అంటే ప్రజాసేవ చేస్తారు. కానీ ఇప్పుడు ఎవరెక్కువ బూతులు తిడితే వారు మంచివారట. బూతుల రత్నకు ఎమ్మెల్యే, బూతుల సామ్రాట్‌కు ఎంపీ, ఇంకా ఎక్కువ తిడితే నటసామ్రాట్ కింద మంత్రి పదవి ఇస్తారు. ఇదేం పద్ధతి!? మనం ఉండేది బూతులు పడడానికా!? ఇలాంటి వారు రాజకీయాలకు అవసరమా..? కానీ ప్రజల కోసం అన్నీ పడుతున్నా. సభ్యత అడ్డం వస్తోంది గానీ లేకుంటే వారి అంతు చూసే వాడిని. రాష్ట్ర భవిష్యత్ కోసం సంయమనం పాటిస్తున్నా' అంటూ టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఉద్ఘాటించారు. నెల్లూరు పార్లమెంటుకు సంబంధించి 'రా.. కదలిరా..' కార్యక్రమం ఆదివారం నెల్లూరులోని ఎస్వీజీఎస్ మైదానంలో జరిగింది. మధ్యాహ్నం 12 గంటలకు హెలికాప్టర్‌లో కనుపర్తిపాడులోని హెలిప్యాడ్‌కు చేరుకున్న చంద్రబాబు, అక్కడి నుంచి రోడ్డు మార్గాన సభా వేదికకు చేరుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో చంద్రబాబు సుమారు 45 పాటు ప్రసంగిస్తూ శ్రేణుల్లో నూతనోత్తేజం నింపారు. జిల్లాలోని వైసీపీ ఎమ్మెల్యే దోపిడీ, అరాచకాలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. చంద్రబాబు ప్రసంగం ఆయన మాటల్లోనే...

వీరు ఎమ్మెల్యేలా!?

'నెల్లూరులో ఎమ్మెల్యే అనిల్‌కుమార్ చేసిన అభివృద్ధి నిల్.. మాటలు ఫుల్..! పోలవరం చర్చ వస్తే పర్సంటా.. ఆఫ్ పర్సంటా అంటాడు. తొడలు కొడతాడు, మీసం మెలేస్తాడు. పిచ్చిపిచ్చిగా మాట్లాడతాడు, గావు కేకలు పెడతాడు కానీ అభివృద్ధి గురించి అడిగితే నోరు కూడా తెరవలేడు. కానీ ఈయన పెద్ద ఎమ్మెల్యే. దొంతాలి వద్ద బినామీల పేరుతో రూ.100 కోట్లు విలువ చేసే 50 ఎకరాలు, నాయుడుపేటలో 58 ఎకరాలు, ఇస్కాన్ సిటీలోనూ బినామీల పేరుతో భూములు కొట్టేశాడు. వీటన్నింటినీ చూసి ప్రజలు ఛీ కొడతా ఉంటే ముఖ్యమంత్రి అతనికి సీటు లేదని చెప్పాడు. ఎక్కడకు పంపుతారో తెలియదు. ఇంకా గాల్లో ఉన్నాడు. కావలి ఎమ్మెల్యే గురించి ఎంత చెప్పినా తక్కువే. అతను కావలికి పట్టిన చెద. పేరు చెప్పేది కూడా నాకిష్టం లేదు. అరాచకాలకు బ్రాండ్ అంబాసిడర్ ఆయన. లేఅవుట్ వేస్తే కప్పం కట్టాలి. ఇళ్లు కడితే కమీషన్ ఇవ్వాలి. షాపు పెట్టుకుంటే వసూలు చేస్తాడు. కప్పరాళ్లతిప్పలో బీసీ గురుకుల పాఠశాల భూమి 4 ఎకరాలను కబ్జా చేశాడు. కావలి రూరల్, దగదర్తిలో అక్రమ గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నారు. కోవూరులో నల్లపురెడ్డి డైలీ, వీక్లీ, మంత్లీ మామూళ్లు దండుకుంటున్నాడు.ఒకటి కాదు.. గోవా, పాండిచ్చేరి నుంచి మద్యం కూడా ఇక్కడకు వస్తూ ఉంది. లేఅవుట్ వేయాలంటే కమీషన్ ఇవ్వాలి.ఇసుకలో దోపిడీ. చివరకు ఎమ్మెల్యే తమ్ముడే అన్నకు సీటు ఇవ్వొద్దని చెబుతున్నాడు. ఆత్మకూరులో పేరుకే విక్రమ్. బంధువులందరి ద్వారా కాంట్రాక్టులు, లేఅవుట్లు, ఇసుక దందాలు చేస్తున్నారు. మైనింగ్ డీల్స్ చేస్తున్నారు.సర్వేపల్లిలో ఒక ఎమ్మెల్యే ఉన్నాడు కాకాణి. కాణి లేనిదే పని జరగదు. పోర్టును కూడా అడ్డం పెట్టుకొని డబ్బులు దోచేస్తూ అక్కడ కూడా కార్యక్రమాలు జరగకుండా అడ్డుకుంటున్న ప్రబుద్ధుడు కాకాణి.

అందుకే తిరుగుబాటు..

టీడీపీ హయాంలో దళిత, గిరిజన విద్యార్థుల కోసం నెల్లూరు రూరల్ మండలం అక్కచెరువుపాడులో గురుకుల పాఠశాల నిర్మించాం. 90 శాతం పూర్తయింది. ఆ పది శాతాన్ని పూర్తి చేయాలని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఎన్నిసార్లు తిరిగినా పని జరగలేదు. కొండాయపాలెం గేట్ వద్ద అంబేడ్కర్ స్టడీ సర్కిల్, బీసీ భవన్ నిర్మాణం చేపడితే వాటిని పూర్తి చేయమని ప్రభుత్వాన్ని అడిగారు. కానీ చేయలేదు. ఆమంచర్లలో 500 ఎకరాల భూమి ఉంటే అందులో పరిశ్రమలు పెడితే ఉద్యోగాలు వస్తాయని అడిగితే అతీ గతీ లేదు. సీఎం చేసేవి తప్పు అని మరో ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి కూడా గళమిప్పారు. తొలిసారి తిరుగుబాటు చేసిన ఇద్దరు ఎమ్మెల్యేలు నెల్లూరు జిల్లాకు చెందిన వారే. అంబేడ్కర్ ఆశయం కోసం చంద్రన్న ఆచరణ చేస్తున్నారని, ప్రజల బతుకు బాగుండాలంటే మళ్లీ టీడీపీ రావాలని పాదయాత్ర చేస్తున్న నెల్లూరుకు చెందిన చింతల అశోక్‌కుమార్‌ను అభినందిస్తున్నా.

అధికారంలోకి రాగానే..

'తెలుగుదేశం అధికారంలోకి రాగానే సోమశిల హైలెవల్ కెనాల్, సోమశిల ఆప్రాన్ పనులు పూర్తి చేస్తాం. కొండ్లపూడి లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేస్తాం. కనిగిరి రిజర్వాయర్‌లో పూడిక తీస్తాం. నాడు దగదర్తిలో నేనే ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపన చేశా. అధికారంలోకి రాగానే దానిని పూర్తి చేస్తా. చెన్నై-నెల్లూరు-తిరుపతి నగరాలను ట్రై సిటీ కింద కనెక్ట్ చేసి నెల్లూరు జిల్లాను పారిశ్రామిక హబ్‌గా మారుస్తా. రాళ్లపాడు కాలువ పనులు పూర్తి చేస్తాం. ఉలవపాడు మామిడి మార్కెట్‌ను పూర్తి చేసి ప్రారంభిస్తాం. ఉదయగిరిలోని పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ పనులు కూడా పూర్తి చేస్తాం".



ఆటోలో తరలివచ్చిన అభిమానం

నేడు టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం

తిరుమల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ధర్మకర్తల మండలి సమావేశం సోమవారం జరగనుంది. తిరుమలలోని అన్నమయ్య భవనంలో చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి అధ్యర్యంలో సభ్యులు సమావేశమై అజెండా అంశాలపై చర్చించనున్నారు. ఫిబ్రవరిలో జరగనున్న ధార్మిక సదస్సుతోపాటు ఒక్కరోజు బ్రహ్మోత్సవంగా పిలిచే రథసప్తమి ఏర్పాట్లపై చర్చించనున్నారు. అలాగే తిరుపతి, తిరుమలలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, వివిధ రకాల కొనుగోళ్లు, ఇంజనీరింగ్ పనులపై చర్చ జరగనుంది. ముఖ్యంగా ఎన్నికలు సమీపిస్తున్న క్రమంలో 2024-25 వార్షిక బడ్జెట్‌ను కూడా ప్రవేశపెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే ఈవిషయాన్ని టీటీడీ గోప్యంగా ఉంచింది.

కట్టుకున్నోడే కాలయముడయ్యాడు

- కత్తితో నరికి చంపేశాడు
- అడ్డొచ్చిన భార్య పిన్నిపైనా దాడి



దొరసానమ్మ (ఫైల్‌ఫొటో) - నిందితుడు శివ

ఓజిలి, జనవరి 28: కట్టుకున్నోడే కాలయముడయ్యాడు. భార్యను కత్తితో నరికి చంపేశాడు. అడ్డొచ్చిన ఆమె పిన్నిపైనా దాడి చేసి పరారయ్యాడు. ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. ఈ దారుణ సంఘటన ఓజిలి మండలంలోని వీర్లగునుపాడులో ఆదివారం జరిగింది. నాయుడుపేట రూరల్ సీఐ జగన్మోహన్‌రావు తెలిపిన వివరాల మేరకు.. వీర్లగునుపాడుకు చెందిన దొరసానమ్మ(25)ను ఎనిమిదేళ్ల కిందట బాలాయపల్లి మండలం కోటంబేడు గ్రామానికి చెందిన వల్లూరు శివకిచ్చి పెళ్లి చేశారు. వీరికి కుమార్తె, కుమారుడున్నారు. ఏడాదిగా దంపతుల మధ్య మనస్పర్థలు రావడంతో దొరసానమ్మ పుట్టింటికి వచ్చేశారు. రెండువారాల కిందట శివ కూడా వీర్లగునుపాడుకు వచ్చాడు. ఇక్కడే పనులు చేసుకుంటూ భార్యతో సఖ్యతగా ఉంటున్నాడు. ఆదివారం పథకం ప్రకారం గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న అటవీ ప్రాంతానికి కట్టెల కోసమని దొరసానమ్మతోపాటు ఆమె పిన్ని మంజులమ్మని కూడా తీసుకెళ్లాడు. అక్కడ కట్టెలు కొట్టుకుంటూ ఉన్నట్లుగా నటిస్తూ అదను చూసి భార్యను కత్తితో నరికేశాడు. ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అడ్డొచ్చిన ఆమె పిన్నిపైనా దాడి చేశాడు. ఆమె తలకు తీవ్రగాయమైంది. అయినా ఆమె ఎలాగోలా తప్పించుకుని రోడ్డుకు సమీపంలోని కాలువ దగ్గకు వద్దకొచ్చి స్పృహ కోల్పోయింది. నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మంజులమ్మను నాయుడుపేట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించి.. మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. దొరసానమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించినట్లు సీఐ జగన్మోహన్‌రావు తెలిపారు.



తీవ్రంగా గాయపడ్డ మంజులమ్మ

ప్రాజెక్టులను అటకెక్కించిన జగన్

- మన్నవరం, హంద్రీ-నీవా, గాలేరు-నగరిని పట్టించుకోని ప్రభుత్వం
- పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల విమర్శ



పీసీసీ చీఫ్‌కు స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ శ్రేణులు



సమావేశంలో ప్రసంగిస్తున్న షర్మిల

తిరుపతి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ అభివృద్ధికి తన తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేపట్టిన ప్రాజెక్టులన్నింటినీ జగనన్న ప్రభుత్వం అటకెక్కించిందని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. తిరుపతిలోని రామతులసి కల్యాణ మండపంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన చిత్తూరు, తిరుపతి జిల్లాల కాంగ్రెస్ పార్టీ శ్రేణుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు ఎన్డీయే ప్రభుత్వం ద్వారా బీహెచ్ఈఎల్, ఎన్టీపీసీ సంయుక్త భాగస్వామ్యంలో రూ.6వేల కోట్ల మన్నవరం ప్రాజెక్టును ఉమ్మడి చిత్తూరు జిల్లాకు మంజూరు చేయించారని గుర్తుచేశారు. అప్పట్లో రూ.వంద కోట్లు మంజూరు చేసి, నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ శంకుస్థాపన చేశారన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ఆ పరిశ్రమ అటకెక్కిందన్నారు. దీనికోసం జగనన్న ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నం చేయలేదని ఆరోపించారు. రాయలసీమలో 6.50 లక్షల ఎకరాలకు సాగు.. 33 లక్షల మందికి తాగునీరందించే హంద్రీ-నీవా ప్రాజెక్టును వైఎస్ 90 శాతం పూర్తి చేయించారన్నారు. పది శాతం పనులను చంద్రబాబు ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందని ఎద్దేవా చేసిన నాటి ప్రతిపక్ష నేత.. తాను అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో పూర్తి చేయిస్తానన్నారని గుర్తు చేశారు. ఆయన సీఎం అయి 60 నెలలు గడుస్తున్నా 10 శాతం పనులను పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. గాలేరు- నగరి ప్రాజెక్టునూ ప్రభుత్వం అటకెక్కించేసిందన్నారు. ఇలా ప్రాజెక్టులు అటకెక్కించిన జగనన్నకు.. రాయలసీమ ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉందంటే ఎలా నమ్మాలని ప్రశ్నించారు. వైఎస్ ప్రాజెక్టులను పూర్తి చేయనివారు ఆయన వారసులెలా అవుతారని నిలదీశారు. ఎన్నికలకు సమయం తక్కువగా ఉందని రోజువారీ లక్ష్యం నిర్దేశించుకుని ప్రతి ఇంటినీ, ప్రతి మనిషినీ, ప్రతి వర్గాన్నీ కలిసేందుకు ప్రయత్నించాలని కార్యకర్తలను కోరారు. వైసీపీ, టీడీపీలను గెలిపిస్తే బీజేపీకి ఓటు వేసినట్టే అని ప్రజలకు చెప్పాలన్నారు. కాంగ్రెస్ గెలిస్తేనే రాష్ట్రానికి విభజన హామీలు నెరవేరుతాయని చెప్పాలన్నారు. ఈ సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్‌రెడ్డి, నగర పార్టీ అధ్యక్షుడు టిక్కీ రాయల్, డీసీసీ అధ్యక్షుడు భాస్కర్ ప్రసంగించగా.. కేంద్ర మాజీ మంత్రి పల్లం రాజు, పీసీసీ మాజీ అధ్యక్షులు రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, పీసీసీ ఉపాధ్యక్షుడు దొడ్డారెడ్డి రాంభూపాల్‌రెడ్డి, కంచన వేణుగోపాల్‌రెడ్డి, ఎన్ఎస్‌యూఐ నేత మద్దెల అమృతతేజ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

బీవీపాళెంలో రిసార్ట్స్ ప్రారంభం


రిసార్ట్స్‌ను ప్రారంభిస్తున్న మంత్రి రోజా

తడ, జనవరి 28: తడ మండలంలోని భీములవారిపాళెం వద్ద నిర్మించిన రిసార్ట్స్‌ను మంత్రి రోజా ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో రాష్ట్రంలో ఇప్పటికే 40 చోట్ల టూరిజం రిసార్ట్స్ నిర్మించామని తెలిపారు. రాష్ట్రంలో ఎన్నో సుందరమైన ప్రదేశాలు, దేవాలయాలు ఉన్నాయని, వాటి ద్వారా పర్యాటకులను ఆకర్షించడమే లక్ష్యంగా రిసార్ట్స్ ప్రారంభిస్తున్నామని చెప్పారు. అనంతరం మంత్రి రోజాను రిసార్ట్స్ లీజుదారు రూఫ్‌వెస్ట్ సంస్థ ఎండీ శ్రీధరణ్‌నారాయణన్ సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ సీఈవో శ్యామ్‌జార్జి, తడ, సూళ్లూరుపేట ఎంపీపీలు కొలవి రఘురెడ్డి, అల్లూరు అనిల్‌రెడ్డి, వైసీపీ నాయకులు పర్వత రెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, రత్నం, సుందరరెడ్డి, నత్తం శ్రీనివాసులు, పర్యాటకశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే డుమ్మా

రిసార్ట్స్ ప్రారంభోత్సవానికి సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య హాజరుకాలేదు. మంత్రి రోజా ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయానికే రిసార్ట్స్ వద్దకు చేరుకున్నారు. ఐదు నిమిషాలపాటు అక్కడున్న మంత్రి వెంటనే వెనుతిరిగి వెళ్లిపోయారు. సాయంత్రం 4.30గంటలకు వచ్చి రిసార్ట్స్‌ను ప్రారంభించారు. దీనిపై అధికారులు మాట్లాడుతూ షెడ్యూలు ప్రకారం మంత్రి మూడు గంటలకు రావాల్సి ఉందని, ముందుగానే వచ్చిన ఆమె విశ్రాంతి తీసుకోవడానికి వెళ్లారని చెప్పారు. అయితే ఎమ్మెల్యే రావడంలేదని తెలిసి మంత్రి వెళ్లిపోయారని అధికార పార్టీ కొందరు నేతలు గుసగుసలాడుకోవడం కన్పించింది.

నేడు టిడ్కో గృహాల ప్రారంభం


టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న ప్రసన్న కుమార్

వెంకటగిరి టౌన్, జనవరి 28: పట్టణంలోని జగనన్న లే అవుట్ వద్ద ఉన్న టిడ్కో గృహాలను సోమవారం ప్రారంభించనున్నట్లు టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక టిట్కో గృహ సముదాయంలో మౌళిక వసతులు పరిశీలించారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 35 ప్రాంతాల్లో టిట్కో ఇళ్ల ప్రారంభించి లబ్ధిదారులకు అందజేశామని చెప్పారు. వెంకటగిరిలో నిర్మించిన టిడ్కో ఇళ్లను సోమవారం లబ్ధిదారులకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి తాళాలు అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో టిట్కో చీఫ్ ఇంజనీర్ జాన్ సైమన్ రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శాస్త్రి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పార్థసారథి, కమిషనర్ వెంకటరమణ పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే అభ్యున్నతి


క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న బీస్ నాయకులు

చిల్లకూరు, జనవరి 28 బలిజ కులస్థులందరూ ఐకమత్యంగా ఉంటేనే అభ్యున్నతి సాధించగలమని గ్రూప్ థియేటర్ల యజమాని చదలవాడల హరి ప్రసాద్, బలిజ ఉద్యోగుల అభ్యుదయ సేవాసమితి(బీస్) జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ అన్నారు. ఆదివారం గూడూరు సాయిబాబా మందిరం నుంచి బీస్, బలిజ అభ్యుదయ సేవామితి ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం గూడూరులోని సిరామిక్ ప్రభుత్వ కళాశాల సమీపంలోని ఓ ప్రైవేటు క్లబ్‌లో బీస్ క్యాలెడర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సారంగం శ్రీనివాసులు, మదనమేటి రమణయ్య, పేటేటి ప్రకాశ్‌రావు, పేటేటి వెంకటేశ్వరరావు, కృష్ణయ్య, శేషయ్య, పెళ్లి ఉదయ్‌భాస్కర్, పడియాల శ్రీహరి, పూడి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్పయాత్ర

నాయుడుపేట టౌన్, జనవరి 28: మండలంలోని భీమవరం గ్రామంలో శనివారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఎస్సీ మోర్చ రాష్ట్ర మాజీ కార్యదర్శి బొల్లకాయల విజయభాస్కర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చెంచుకృష్ణయ్య, చంద్రారెడ్డి, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

క్లబ్ ఎన్నికలు ఏకగ్రీవం

వెంకటగిరి టౌన్, జనవరి 28: వెంకటగిరి క్లబ్ ఎన్నికలు ఏకగ్రీవంగా ఆదివారం జరిగాయి. అధ్యక్షుడుగా ప్రముఖ న్యాయవాది లక్కమనేని కోటేశ్వరరావు ఎన్నికయ్యారు. ఆయనను క్లబ్ సభ్యులు సన్మానించారు.

కోటమ్మకు పూజలు


ప్రత్యేక అలంకరణలో కోటమ్మ

కోట, జనవరి 28: కోట గ్రామదేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. పండితులు అమ్మవారికి పలు అభిషేకాలు చేసి ప్రత్యేక అలంకరణలో ఉంచారు. కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు, ఓజిలి మండలాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు పాలకమండలి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు

ఉచిత కంటివైద్య శిబిరం


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గూడూరు, జనవరి 28: స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం చాగణం లలితమ్మ, భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి, పలువురిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధి సీతారామనాయుడు, వైద్యులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ


నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న రెడ్డిసంక్షేమ సంఘం నాయకులు

చిల్లకూరు, జనవరి 28: గూడూరు డీఎన్ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం సింహపురిరెడ్డి సంక్షేమసంఘం ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులురెడ్డి, ప్రజేంద్రరెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన జనసేన ఇన్‌చార్జి

నాయుడుపేట, జనవరి 28: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని సూళ్లూరుపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్ మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు.

లక్ష్యాలను ఎంచుకుని కష్టపడి చదవాలి

చిల్లకూరు, జనవరి 28: విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకుని వాటిన సాధించుకునేందుకు కష్టపడి చదవాలని ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఏఎల్‌పీ పాఠశాలలో పాఠశాల వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులలో దాగివున్న నైపుణ్యాలను గుర్తించి వాటిలో రాణించేలా ప్రోత్సహించాలన్నారు. పాఠశాల కరస్పాండెంట్ బుస్సారెడ్డి శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో చదువులతోపాటు విద్యార్థులకు క్యారెక్టర్ కూడా ఎంతో అవసరమన్నారు. ఉపాధ్యాయులతోపాటూ తల్లిదండ్రులు కూడా పిల్లల విషయంలో కూడా శ్రద్ధ చూపాలన్నారు. వారికి ఏది అవసరమో అది అందించడంతో పాటు వారిలో దాగివున్న కళలను గుర్తించి పోత్సహించాలన్నారు. కార్యక్రమంలో బుస్సారెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, ప్రిన్సిపాల్ ఓంనఃశివాయ, హెచ్‌ఎం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలు: టీడీపీ


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

చిల్లకూరు, జనవరి 28: రాష్ట్రంలో అరాచకపాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని టీడీపీ నాయకులు అన్నారు. ఆదివారం గూడూరు టీడీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో అరాచకాలు పెరిగిపోయాయన్నారు. నాలుగున్నరేళ్లలో ఒక్క అభివృద్ధి పని కూడా చేపట్టలేదని, పైగా విద్యుత్, ఆర్టీసీ చార్జీలు, పన్నులు భారీగా పెంచారని, ఇక నిత్యావసర ధరలు పెరిగిపోవడంతో పేదలు ఆర్థికంగా అవస్థలు పడుతున్నారన్నారు. వైసీపీని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ నేతలు చెప్పారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, చంద్రమౌళి, రావుల శివప్రసాద్‌గౌడ్, షాహుల్ తదితరులు పాల్గొన్నారు.

పేలవంగా 'వైసీపీ సాధికార సభ'


జనాలు వెళ్లిపోవడంతో పలచబడ్డ సభా ప్రాంగణం, ప్రసంగిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి(ఇన్‌సెట్లో)

కోట, జనవరి 28: కోట పట్టణంలో ఆదివారం రాత్రి జరిగిన వైసీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర సభ పేలవంగా ముగిసింది. గూడూరు నియోజకవర్గ స్థాయిలో సభను ఇక్కడ పెట్టి ఐదు మండలాల నుంచి జనాలను తరలించారు. అయితే నాయకులు ప్రసంగాలు మొదలుపెట్టేలోపే సభా ప్రాంగణం నుంచి వచ్చిన జనం వచ్చినట్లుగా మెల్లమెల్లగా వెళ్లిపోయారు. మిగిలినవారికే వైసీపీ నాయకులు ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చి ముగించారు. రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యుడు బి.మస్తాన్‌రావు, ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, మాజీమంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీలు మేరిగ మురళి, బల్లి కల్యాణ్, నాయకులు పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, కొడవలూరు ధనంజయరెడ్డి, నల్లపరెడ్డి వినోద్‌రెడ్డి, పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనానికి ఇక్కట్లు


బోసిపోయిన ఆర్టీసీ బస్టాండు

సభ ఏర్పాటు చేసిన కోట బజారు సెంటరు ఇరుకు ప్రాంతం. ఇక్కడ ఇరువైపులా అంగళ్లకు ఓవైపు వైసీపీ నాయకులు ఫ్లెక్సీలు, కటౌట్లు కట్టేయగా, మరోవైపు పోలీసులు బ్యారికేడ్లు పెట్టడంతో దుకాణాలనూ మూత వేయాల్సి వచ్చిందని వ్యాపారులు వాపోయారు. ఇక మధ్యాహ్నం 11 గంటల నుంచే బస్టాండులోకీ బస్సులనూ రానీయలేదు. దీనివల్ల జనానికి ఇక్కట్లు తప్పలేదు.

విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలి


జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి చెన్నయ్యను సత్కరిస్తున్న వార్డెన్లు

కోట, జనవరి 28: విద్యార్థులు ఏకాగ్రతతో చదివితే అనుకున్న లక్ష్యాలను చేరుకోగలుగుతారని జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి చెన్నయ్య అన్నారు. మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం కోట, చిట్టమూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట మండలాల్లోని సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మోటివేషన్ తరగతులు జరిగాయి. ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ విద్యార్థుల్లో పరీక్షలంటే భయాన్ని ముందుగా పోగొట్టాలన్నారు. ఇలాంటి శిక్షణా తరగతుల వల్ల విద్యార్థులు సులభంగా పరీక్షలు రాయగలుగుతారన్నారు. ప్రతి వార్డెన్ ఆ దిశగా విద్యార్థులపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. అనంతరం వార్డెన్‌లు చెన్నయ్యకు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో వార్డెన్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రబాబు సభకు తరలిన టీడీపీ నేతలు


చంద్రబాబు సభలో నెలవలతో కలసి పెళ్లకూరు టీడీపీ నేతలు

పెళ్లకూరు, జనవరి 28: నెల్లూరులో ఆదివారం టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు నిర్వహించిన రా.. కదలిరా.. సభకు పెళ్లకూరు మండలం నుంచి సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివెళ్లాయి. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి, వట్టికుండల శేఖర్‌నాయుడు, జిల్లా కార్యదర్శి నూతలపాటి ప్రసాద్‌నాయుడు, సీనియర్ నాయకులు దామెర ప్రసాద్‌నాయుడు, వెంకటాచలంనాయుడు తదితరులు ఉన్నారు.

నాయుడుపేట: రా.. కదలిరా.. సభకు నాయుడుపేట నుంచి తిరుపతి పార్లమెంట్ టీడీపీ కార్యదర్శి దార్ల రాజేంద్ర ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

పచ్చదనం, పరిశుభ్రతపై అవగాహన

సూళ్లూరుపేట, జనవరి 28: గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని ఎన్‌సీసీ అధికారి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం కారిజాత గ్రామంలో వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పచ్చదనం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాల గురించి ప్రజలకు వివరించారు. నీటిని పొదుపుగా వాడాలని, ప్రతి నీటిబొట్టునూ ఒడిసి పట్టుకొంటేనే భావితరాలకు అందించగలుగుతామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సర్పంచు సునీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విజయానికి సైనికుల్లా పనిచేయాలి

చిల్లకూరు, జనవరి 28: బీజేపీ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా చేయాలని ఆపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం గూడూరు మండలంలో బీజేపీ ఆధ్వర్యంలో పల్లెకుపోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 9,10,11 తేదీల్లో పల్లెకుపోదాం కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వం పేదల కోసం అమలు పరుస్తున్న పథకాలపై అవగాహన కల్పించి పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. బాలకృష్ణమ నాయుడు, బిందురెడ్డి, సురేష్‌బాబు, రమేష్‌బాబు, వెంకటేశ్వర్లు, నాగార్జున, మురళీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

చిన్నారి వైద్య ఖర్చులకు ఆర్థికసాయం

సూళ్లూరుపేట, జనవరి 28: సూళ్లూరుపేట పట్టణంలోని పాలవల్లివారి వీధికి చెందిన శివకుమార్, భార్గవి దంపతుల కుమారుడు సూర్యతేజ వైద్య ఖర్చులకు చిరంజీవి సేవాసంఘం నేతలు రూ.15500 ఆర్థికసాయం ఆదివారం అందజేశారు. మూడేళ్ల సూర్యతేజ వెన్నుపూస ఎన్సోసీయం వ్యాధితో బాధపడుతున్నట్లు వైద్యులు తెలిపారు. పేద కుటుంబం కావడంతో చిరంజీవి సేవా సంఘం ప్రతినిధులు స్పందించి ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో హరిబాబు, శివప్రసాద్, బాబు, కోటి తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో అ'పూర్వ' సమ్మేళం

చిల్లకూరు, జనవరి 28: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 2001-2003లో ఇంటర్ చదివిన విద్యార్థుల సమావేశం ఆదివారం జరిగింది. తాము చదువుకున్న రోజులను గుర్తుచేసుకుని విద్యార్థులు నాటి అనుభవాలను పంచుకున్నారు. రూ.2.50లక్షలతో పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీవో జయభారతి, ప్రిన్సిపాల్ మీరాసాహెబ్, పీడీ శిరేష్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్త కలెక్టర్‌గా లక్ష్మీశ

- హౌసింగ్ ఎండీగా వెంకటరమణారెడ్డి
- తిరుపతి నూతన కమిషనర్‌గా అదితి సింగ్


లక్ష్మీశ, అదితి సింగ్

తిరుపతి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కె.వెంకరమణారెడ్డి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో డాక్టర్ జి.లక్ష్మీశ నూతన కలెక్టర్‌గా నియమితులయ్యారు. అలాగే తిరుపతి మున్సిపల్ కమిషనర్ డి.హరితకు స్థాన చలనం కలిగింది. ఆమె స్థానంలో అదితి సింగ్ రానున్నారు. ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఐఏఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా ఈ మార్పులు జరిగాయి. ప్రస్తుత కలెక్టర్ వెంకరమణారెడ్డి.. ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా నియమితులు కానున్నారు. ఇపుడు ఎండీగా ఉన్న లక్ష్మీశ ఇక్కడికి కలెక్టర్‌గా రానున్నారు. 2013 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన లక్ష్మీశ కర్నాటక రాష్ట్రం తుంకూరు జిల్లాలోని మారుమూల గ్రామమైన హోలుగుండనహల్లికి చెందినవారు. సివిల్స్‌లో తొలుత ఐఎఫ్ఎస్‌కు ఎంపికై హిమాచల్‌ప్రదేశ్ కేడర్‌లో పనిచేశారు. తర్వాత 2013లో మరోసారి సివిల్స్ రాసి ఐఏఎస్ సాధించి ఏపీ కేడర్ ఎంచుకున్నారు. కర్నూలులో ట్రైనీ కలెక్టర్‌గా శిక్షణ పూర్తి చేసుకున్న లక్ష్మీశ కృష్ణా జిల్లా నూజివీడు సబ్ కలెక్టర్‌గా తొలి పోస్టింగ్ అందుకున్నారు. ఆపై పార్వతీపురం ఐటీడీఏ పీవోగానూ, తూర్పు గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్‌గానూ, గ్రేటర్ వైజాగ్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా వివిధ హోదాల్లో పనిచేశారు. ప్రస్తుతం ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీగా పనిచేస్తున్నారు. ఇక తిరుపతి మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయిన అదితి సింగ్ 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అధికారి. ఆమె విశాఖపట్టణం జిల్లాలో ట్రైనీ కలెక్టర్‌గా శిక్షణ ముగించుకుని విజయవాడ సబ్ కలెక్టర్‌గా తొలి పోస్టింగు పొందారు. అక్కడి నుంచి ఇపుడు తిరుపతి కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఇప్పటివరకూ కమిషనర్‌గా పనిచేసిన హరిత ఏపీయూఎఫ్ఐడీసీ ఎండీగా బదిలీ అయ్యారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.92 కోట్లు

తిరుమల, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2.92 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది.


చంద్రబాబు నాయుడిని కలిసిన డాక్టర్ బొలిగల మస్తాన్ యాదవ్

పెద్దిరెడ్డిపై తిరుగుబాటు

- అక్రమాలన్నీ మీరు చేసి నిందలు నాపైనా?
- సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం ఆగ్రహం
- వైసీపీలో తీవ్ర దుమారం
- మంత్రి ప్రాబల్యానికి ఎదురుదెబ్బ

తిరుపతి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఆవిర్భావం నుంచీ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కొనసాగుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధిపత్యానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అధికార పార్టీకి చెందిన సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆదివారం చేసిన తిరుగుబాటు రాష్ట్రవ్యాప్తంగా దుమారం రేపింది. ప్రత్యేకించి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ప్రకంపనలు సృష్టించింది. తిరుపతి, చంద్రగిరి వంటి ఒకటి రెండు నియోజకవర్గాలు మినహా మిగిలిన అన్ని నియోజకవర్గాల్లోనూ సొంత వర్గాన్ని పెట్టుకుని పార్టీపై పెత్తనం చెలాయిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి వర్గాన్ని ఆదిమూలం తిరుగుబాటు కలవరపాటుకు గురి చేసింది. కొంత వెనక్కి వెళితే.. 2014లో వైసీపీ తరపున పలమనేరు, తంబళ్లపల్లె సెగ్మెంట్ల నుంచీ పోటీ చేసిన అమరనాథరెడ్డి, ఏపీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పెద్దిరెడ్డి వర్గంతో సర్దుబాటు కాలేకనే పార్టీని వీడారన్న ప్రచారం అప్పట్లో జరిగింది. తిరుపతి, చంద్రగిరి మినహా మిగిలిన అన్ని సెగ్మెంట్లలోనూ అభ్యర్థుల ఎంపికలో పెద్దిరెడ్డి సిఫారసే కీలకం అన్న సంగతి బహిరంగ రహస్యమే. ప్రస్తుతానికొస్తే నగరిలో మంత్రి రోజా, జీడీనెల్లూరులో డిప్యూటీ సీఎం నారాయణస్వామి సైతం వారి సొంత నియోజకవర్గాల్లో సొంత పార్టీ నేతల నుంచీ వ్యతిరేకతను ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. వారి వ్యతిరేక వర్గాలు పెద్దిరెడ్డిని ఆశ్రయించుకుని పనులు చేసుకుంటున్నాయన్నది కూడా పార్టీలో అందరికీ తెలిసిన విషయమే. ముఖ్యంగా రోజా నియోజకవర్గంలో ఆమె వ్యతిరేకులు ఆమెను కాదని కీలక పదవులు పొందడం వెనుక పెద్దిరెడ్డి సిఫారసు ఉందన్న ప్రచారం ఉంది. తాజాగా టికెట్ల విషయానికొస్తే సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు టికెట్ వద్దని పలువురు పెద్దిరెడ్డిని కలసి ఫిర్యాదు చేయడం తెలిసిందే. అలాగే సత్యవేడులో ఎమ్మెల్యే ఆదిమూలాన్ని వద్దంటున్న వర్గం కూడా ఆయన్నే ఆశ్రయించడమూ కొత్తకాదు. మదనపల్లెలో ఎమ్మెల్యే నవాజ్ బాషా టికెట్ గల్లంతైన సందర్భంలో కూడా ఆయన పెద్దిరెడ్డి పైనే అసంతృప్తి వ్యక్తం చేసినట్టు ప్రచారం జరిగింది. పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు టికెట్ గల్లంతైనప్పుడు కూడా ఆయన నేరుగా పెద్దిరెడ్డిపైనే ఆరోపణలు చేశారు. తర్వాత మళ్లీ క్షమాపణలు చెప్పారు. ఇవన్నీ ఉమ్మడి జిల్లా వైసీపీ వ్యవహారాల్లో పెద్దిరెడ్డి జోక్యాన్ని తెలిపే ఉదంతాలే. కాకపోతే ఇప్పటి వరకూ ఎవరూ పెద్దిరెడ్డిపై ఆదిమూలం స్థాయిలో తీవ్ర ఆరోపణలు చేసింది లేదు. లోలోపల బాధపడడం, నిష్ఠూరం చేయడం తప్పితే బాహాటంగా వ్యతిరేకించింది లేదు. తాజా పరిణామాలతో ఆదిమూలం పెద్దిరెడ్డితోపాటు ఆయన కుమారుడు మిథున్‌రెడ్డి ఆధిపత్యాన్ని ప్రశ్నించడంతోపాటు అవినీతి ఆరోపణలు కూడా చేశారు. ఇసుక, గ్రావెల్ అక్రమ తవ్వకాలకు కారణం నేరుగా పెద్దిరెడ్డేనంటూ ఆరోపించారు. వీటన్నింటికీ మించి ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గాల్లో పెద్దిరెడ్డి పెత్తనమేమిటన్న ప్రశ్న దళిత సామాజికవర్గాలను సూటిగా తాకింది. క్రమేపీ విద్యావంతులవుతూ చైతన్యవంతంగా మారుతున్న ఆ వర్గాలను ఆదిమూలం ప్రశ్న అమాంతం కదిలించిందనే చెప్పాలి. వాస్తవంగా కూడా వైసీపీకి సంబంధించి జిల్లాలో ప్రతి ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గమూ డిస్టర్బ్ అయింది. టికెట్ గల్లంతు కావడమో, లేదంటే ఇతర ప్రాంతాలకు బదిలీ కావడమో జరిగింది. దీంతో ఈ అంశం జిల్లా వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ఇతర నియోజకవర్గాల్లో డిస్టర్బ్ అయిన వారు కూడా ఆదిమూలం చొరవకు లోలోపల సంతోషిస్తున్నట్టు సమాచారం. తాము చేయలేని పని ఆయన చేశారని కితాబిస్తున్నట్టు తెలుస్తోంది. వైసీపీలో ఎస్సీలకు తగిన గౌరవం లేదని ఆదిమూలం ఆవేదన వ్యక్తం చేయడం, కళ్లెదుట ఆ వాస్తవం కనిపిస్తుండడంతో జిల్లావ్యాప్తంగా దళిత సామాజికవర్గాలు ఆలోచనలో పడుతున్నాయి.

- 1989లో నేను మాజీ మంత్రి చెంగారెడ్డి వద్ద ఉన్నపుడు పెద్దిరెడ్డి మోటర్ సైకిల్‌పై తిరిగేవారు. ఇపుడు ఇన్ని ఆస్తులు ఎలా వచ్చాయి?
- సత్యవేడులో ఇసుక, గ్రావెల్ అక్రమ దందాలన్నీ పెద్దిరెడ్డి కనుసన్నల్లోనే జరిగాయి. చెక్‌పోస్టుల్లో మనుషులను పెట్టి డబ్బు సంపాదించుకున్నది వాళ్లు. కానీ చెడ్డపేరు మాత్రం నాకు ఆపాదించారు.
- ఎమ్మెల్యేగా నాకింకా 80 రోజుల సమయం ఉంది. నాకు తెలియకుండా సత్యవేడు నియోజకవర్గ సమావేశాన్ని వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న తిరుపతిలో ఎలా నిర్వహిస్తారు? ఇలా శ్రీకాళహస్తి, నగరి, తిరుపతి నియోజకవర్గాల మీటింగులను మీ ఇంట్లో పెట్టగలిగే దమ్ముందా? అసలు ఎస్సీ నియోజకవర్గంలో మీ పెత్తనం ఏమిటి? శ్రీకాళహస్తి, చెవిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, రోజా నియోజకవర్గాల్లో ఇలా చేయగలరా?
- నా నియోజకవర్గంలో 33 రోడ్ల పనులను పెద్దిరెడ్డి కాంట్రాక్టు తీసుకుని ఒక్కటీ పూర్తి చేయలేదు. నాకు తెలియకుండా క్వారీలకు అనుమతులు ఇచ్చారు.

లోపాయికారి ఒప్పందంతోనే నిందలు: ఎంపీ

తిరుపతి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వేరేపార్టీవాళ్లతో చేతులు కలిపి నిందలు వేస్తున్నారని తిరుపతి ఎంపీ గురుమూర్తి ఆదివారం విమర్శించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డిపై ఆయన వ్యాఖ్యలు సరికాదన్నారు. వైసీపీలో ఎస్సీలకు గౌరవంలేదని ఆయన చెప్పడం బాధాకరమన్నారు. దళితులకు ప్రాధాన్యం ఉన్నందునే ఆదిమూలానికి ప్రమోషన్ ఇచ్చి ఎంపీగా పోటీ చేసే అవకాశం పార్టీ కల్పించిందన్నారు. ఎంపీ స్థానం పట్ల ఇష్టంలేకపోతే అధిష్ఠానానికి విజ్ఞప్తి చేసుకోవాలేగానీ, ఇలా రోడ్డుకెక్కడం సరికాదన్నారు. క్రమశిక్షణ చర్యలపై పార్టీ నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.

వీరిపై చర్యలు తీసుకునే ధైర్యముందా?

- ఆదిమూలం ప్రశ్నలకు ఎవరు జవాబు చెబుతారు
- టీడీపీ నేత నరసింహయాదవ్

'మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి ఇప్పిస్తామని మంత్రి రోజా రూ.40 లక్షలు తీసుకున్నారని వైసీపీకే చెందిన కౌన్సిలరు భువనేశ్వరి ఆరోపించారు. మరి, ఆమెను పదవి నుంచి బర్తరఫ్ చేసే ధైర్యం మీకుందా? నిత్యం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి భూమాయలు పత్రికల్లో వస్తున్నాయి. ఆయనపై చర్యలు తీసుకోగలరా? అంతెందుకు పాపాల భైరవుడు పెద్దిరెడ్డి రూ.35 వేల కోట్ల సహజ వనరుల ద్వారా దోచింది నిజం కాదా? ఆయనకు టికెట్ నిరాకరించే శక్తి జగన్‌కి ఉందా' అని తిరుపతి జిల్లా టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్ ప్రశ్నించారు. పిచ్చాటూరులో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. అగ్రవర్ణాల వారికి మాత్రం వారసులను ప్రకటించి దళితులకు టికెట్ లేదని కరాకండిగా చెప్పడం ఏ సామాజిక న్యాయమని నిలదీశారు. సత్యవేడు నియోజకవర్గంలో రోజుకు 200 టిప్పర్ల ఇసుక తరలించి లూటీ చేసింది పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్‌రెడ్డి అయితే.. ప్రజలతో సత్సంబంధాలు కలిగిన ఆదిమూలంపై మీ జులుం ప్రదర్శించడం ఏంటన్నారు. 'సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం అడుగుతున్న ప్రశ్నలకు జవాబు ఎవరు చెబుతారు? సజ్జలా.. సాయిరెడ్డా.. పెద్దిరెడ్డా.. ఆఖరికి జగనా' అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా జగన్ దుర్బుద్ధిని ప్రజలు గ్రహించాలని కోరారు.

- పిచ్చాటూరు